E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 21-03-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక:78 || పేజీలు–6
www.ekaburu.com

## ఇంధన వనరులపై దాడుల్ని ఖండించిన మోదీ



ఈ-కబురు, ఢిల్లీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఈసా అల్ ఖలీఫాతో మాట్లాడారు. పశ్చిమాసియా పరిస్థితులపై ఇరువురు నేతలూ చర్చించుకున్నారు. కల్లోలిత పశ్చిమాసియా ప్రాంతంలో ఇంధన వనరులపై, మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను మోదీ ఈ సందర్భంగా ఖండించారు

02

# ఎక్కడున్నా వదలం!



- ప్రపంచంలోని ఏ పర్యాటక ప్రాంతమూ మీకు సురక్షితం కాదు
- శత్రువులకు ఇరాన్ హెచ్చరిక
- గల్ఫ్‌లోని చమురు క్షేత్రాలపై మరిన్ని దాడులు
- కువైట్‌లోని రెండు రిఫైనరీల్లో భారీగా మంటలు
- పేలుళ్లతో దద్దరిల్లిన దుబాయ్, బహ్రెయిన్
- గల్ఫ్‌కు మరో మూడు అమెరికా యుద్ధ నౌకలు
- భూతల దాడుల దిశగా సంకేతాలు

ఈకబురు, దుబాయ్: పశ్చిమాసియా యుద్ధం చినికి చినికి గాలివానగా మారుతోంది. ఇజ్రాయెల్–అమెరికా రాజేసిన యుద్ధ జ్వాలలను ప్రపంచమంతటికీ విస్తరించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోంది. శుక్రవారం ఆ దిశగా స్పష్టమైన సంకేతాలిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా పర్యాటక ప్రాంతాలు, ప్రఖ్యాత విడిది కేంద్రాలన్నింటినీ ఇకపై దాడులకు లక్ష్యంగా చేసుకుంటామంటూ తీవ్ర హెచ్చరికలు జారీచేసింది.
"పార్కులు, విడిది, పర్యాటక కేంద్రాల వంటివేవీ మా శత్రువులకు ఇకపై సురక్షితం కాదు. ప్రపంచవ్యాప్తంగా వాటన్నింటినీ లక్ష్యాలుగా చేసుకుంటాం" అని ఇరాన్ సైనిక ఉన్నతాధికారి అబుల్ ఫజల్ షెకార్చీ స్పష్టం చేశారు.

మిగతా 3లో

## నిధుల మూట..



మొత్తం బడ్జెట్ 3,24,234 కోట్లు

# ప్రగతి బాట



- లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం.. తెలంగాణ బ్రాండ్‌పై నమ్మకం కల్పించాం
- 2026–27 బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూనే ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తాం
- ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయమే సర్కారు లక్ష్యం
- రాష్ట్రాన్ని సుస్థిరమైన అభివృద్ధి వైపు నడిపించేలా బడ్జెట్‌కు రూపకల్పన
- రైతు సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి, విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యం
- గత రెండున్నరేళ్లుగా ఇదే బాటలో సాగుతున్నాం..
- గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ పాలన గాడిలో పెడుతున్నాం
- ఇవి కేవలం అంకెలు కాదని, ప్రజల జీవనగతిని మార్చే లెక్కలన్న ఉప ముఖ్యమంత్రి
- రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాలను నిజం చేసే సంకల్ప పత్రమే ఈ బడ్జెట్ అని స్పష్టికరణ




### ప్రధాన పథకాలకు కేటాయింపులు

(రూ.కోట్లలో)


| | |
|---|---|
| ఆరు గ్యారంటీలు | 50,712 |
| పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి | 33,688 |
| విద్య | 26,674 |
| వ్యవసాయం | 26,674 |
| సాగునీరు | 22,615.40 |
| పురపాలన | 17,907 |
| వైద్యం, ఆరోగ్యం | 13,679 |
| రాజీవ్ యువ వికాసం | 5,800 |
| కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ | 3,683 |
| రీజినల్ రింగ్ రోడ్డు | 1,525 |

**ఈ-కబురు, హైదరాబాద్** :'ధీరోదాత్తుడు ఎన్నడూ అవరోధాలకు బెదరడు. అవరోధాలనే అవకాశాలుగా మలచుకుని ముందుకు సాగుతాడు. ఇప్పుడు రాష్ట్రంలో మా ప్రభుత్వం అదే చేస్తోంది. ప్రగతిలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలపాలనే లక్ష్యం పెట్టుకున్నాం. అందుకే రూ.లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి అంతర్జాతీయంగా తెలంగాణ బ్రాండ్‌పై నమ్మకం కలిగించాం. ఇక పురోగతిలో మా మార్కు చూపుతాం. గత రెండున్నరేళ్లుగా ఈ బాటలోనే సాగుతున్నాం. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక, వ్యవస్థల విధ్వంసాన్ని సరిచేస్తూ, పాత అప్పులను, వాటికి వడ్డీలను కట్టుకుంటూనే పాలనను గాడిలో పెడుతున్నాం. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూనే ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం..' అని రాష్ట్ర ఆర్థిక శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. 'ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే మా లక్ష్యం. మేము పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం. ప్రజలు మాకు అప్పగించిన ఈ అధికారాన్ని ఒక బాధ్యతగా భావించి, ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకుపోతున్నాం. రైతు సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం, విద్యార్థులకు పౌష్టికాహారం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ, రాష్ట్రాన్ని సుస్థిరమైన అభివృద్ధి వైపు నడిపించేదిగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను రూపొందించాం..' అని పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.3,24,234 కోట్ల బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా చూపించారు. ఈ సందర్భంగా ఆయన దాదాపు రెండు గంటల పాటు ప్రసంగించారు. ముఖ్యాంశాలు ఉప ముఖ్యమంత్రి మాటల్లోనే..

**పన్నుల సొమ్ము ప్రజల అభ్యున్నతికే..**
వరసగా నాలుగోసారి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం కల్పించిన ప్రజలకు ధన్యవాదాలు. మేం ప్రజలిక్చిన హామీలను, ప్రజలు మాపై పెట్టుకున్న ఆశలను ఈ రెండున్నరేళ్ల పాలనలో సంతృప్తికరమైన స్థాయిలో నెరవేరుస్తూ వస్తున్నాం. పన్నుల రూపంలో వచ్చిన సొమ్మును, తిరిగి ప్రజల అభ్యున్నతి కోసమే వెచ్చిస్తున్నాం. ప్రతి పైసకు మేం కాపలాదారుగా ఉంటున్నాం. రాజ్యాంగ విలువలకు కట్టుబడి, పారదర్శకతతో పాలన సాగిస్తున్నాం.

మిగతా 2లో

## కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ముందా?



.. రేవంత్‌కు బండి సంజయ్ సవాల్

ఈకబురు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన..

మిగతా 2లో



## కాంగ్రెస్ బడ్జెట్ అంకెల గారడీ

- బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

ఈ-కబురు, హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీలో ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్

03

## గోదావరిలో గల్లంతైన యువకులు...



- ఫొటోలు దిగేందుకు గోదావరిలో దిగిన ఏడుగురు విద్యార్థులు
- ఐదుగురు గల్లంతు.. వారిలో ముగ్గురి మృతదేహాలు లభ్యం ఏపీ– తెలంగాణ సరిహద్దులోని కొల్లుగూడెం వద్ద దుర్ఘటన
- కృష్ణా జిల్లా ఉయ్యూరు, ఇంకొకరిది మదనపల్లె, మరో ఇద్దరిది తెలంగాణలోని భద్రాచలం

03



## గ్యారంటీలకు ఘోరీ

- సీఎం, డిప్యూటీ సీఎంలపై హరీశ్‌రావు ఫైర్
- ఇది ప్రజలను నిరాశపరిచే బడ్జెట్
- వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్ల పెంపు ఊసే లేదు
- మహిళలకు ఇస్తామన్న రూ.2,500, నిరుద్యోగ భృతి
- రూ.4 వేల ప్రస్తావనే లేదు

ఈకబురు, హైదరాబాద్: ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘోరీ కట్టారని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నేత హరీశ్‌రావు విమర్శించారు. ఇది దగాకోరు, ప్రజలను తీవ్రంగా నిరాశపరిచే బడ్జెట్ అని అన్నారు. వృద్ధాప్య, దివ్యాంగుల పింఛను పెంపు ఊసే లేదని, మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ప్రస్తావన కానీ, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.4 వేల గురించిన కనీస ఊసు కానీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతా 2లో

# రేషన్‌కార్డు ఉంటేనే కుటుంబ బీమా

- మూసీ ప్రక్షాళన తప్ప ప్రత్యామ్నాయం లేదు
- దేశస్థాయి ప్రమాణాలతో 10+2 పద్ధతిలో విద్యా విధానం
- మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు యథాతథమే
- మండలాలు, జిల్లాల పునర్వ్యవస్థీకరణ ఇప్పట్లో లేదు
- అజహరుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీల ఫైల్ గవర్నర్ పరిశీలనలో
- చట్ట ప్రకారమే ఫార్ములా–ఈ, ఫోన్ ట్యాపింగ్ విచారణ
- రూ. 3.47 లక్షల కోట్లు అప్పులు తెచ్చాను..
- అందులో రూ. 3.30 లక్షల కోట్లు అప్పులు కట్టేందుకే
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

02

ఈకబురు, హైదరాబాద్ :'హైదరాబాద్: 'కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో నాకెలా తెలుస్తుంది. కొడుకు, కూతురు, అల్లుడు కలిసి గృహ నిర్బంధం చేశారేమో.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అసెంబ్లీకి చెవుల్లో పువ్వులు పెట్టుకొని రావడం కాదు. వారిని వంగోబెట్టి వీపు మీద బండపెట్టాలి. ఊళ్లలో తప్పులు చేసినోళ్లకు బంజరుదొడ్డి కాడ అట్లనే చేసేవారు'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో ఏ పదవిని ఎవరైనా అడగొచ్చని, మల్లికార్జునఖర్గే బ్లాక్ ప్రెసిడెంట్ నుంచి ఏఐసీసీ ప్రెసిడెంట్‌కు ఎదిగారని గుర్తు చేశారు.



## కాంగ్రెస్ బడ్జెట్ ఒక 'డీప్ ఫేక్'

పాత బడ్జెట్‌నే కాపీ పేస్ట్ చేశారు.. కవిత విమర్శలు



03

# గ్యారంటీలకు ఫోరీ



వృద్ధాప్య, దివ్యాంగుల పింఛను పెంపు ఊసే లేదని, మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ప్రస్తావన కానీ, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.4 వేల గురించిన కనీస ఊసు కానీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీల్లో కొన్ని అమలు చేస్తూ అందులోనూ గత బడ్జెట్‌తో పోలిస్తే కోతలు పెట్టారన్నారు.

ఆరు గ్యారంటీల విషయంలో గతేడాది రూ.56 వేల కోట్లు పెడితే, ఈ బడ్జెట్‌లో రూ.50 వేల కోట్లకు కుదించారని పేర్కొన్నారు. కొత్త పింఛన్లు కాదు ఉన్న పింఛన్లు ఊడగొడుతున్నారని ధ్వజమెత్తారు. 3 లక్షల పింఛన్లు తొలగించి, 2 లక్షల కొత్త పింఛన్లు ఇస్తామంటున్నారని విమర్శించారు. 18 ఏళ్లు పైబడిన విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. శుక్రవారం ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, కేపీ వివేకానంద, సంజయ్, పల్లా రాజేశ్వరరెడ్డి, చింతా ప్రభాకర్‌లతో కలిసి హరీశ్‌రావు విలేకరులతో మాట్లాడారు.

**20 పేజీలు, రూ.20 వేల కోట్లు పెంచారు తప్ప..**

'బడ్జెట్ ప్రసంగాన్ని 20 పేజీలు, బడ్జెట్‌ను రూ.20 వేల కోట్లు పెంచారే తప్ప.. ఆరు గ్యారెంటీల ఊసెత్తలేదు. నిధుల కేటాయింపు చేయలేదు. కాగితాల మీద అంకెలు ఉన్నాయి తప్ప.. ప్రజల కష్టాలు తీర్చడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. గత బడ్జెట్‌లో చెప్పిన పథకాలు అమలు చేయలేదు. మళ్లీ అవే పథకాలు వల్లవేశారు. గత బడ్జెట్‌లోనే రాజీవ్ యువ వికాసం పథకానికి రూ.6 వేల కోట్లు కేటాయించారు కానీ పైసా విడుదల చేయలేదు. మళ్లీ ఈసారి బడ్జెట్‌లో అంతే మొత్తాన్ని ప్రతిపాదించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలోనూ అదే జరిగింది. ఇందిరమ్మ, రాజీవ్‌గాంధీల పేర్లు చెప్పివారి ఆత్మ క్షోభించేలా చేస్తున్నారు..' అని హరీశ్‌రావు విమర్శించారు.

**మూడు ముక్కలు చేయడం తప్ప..**

'తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ పేరిట, హైదరాబాద్ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా మూడు ముక్కలు చేయడం తప్ప చేసిందేమీ లేదు. క్యూర్, ప్యూర్, రేర్ కాదు.. చోర్ మోడల్, గోల్‌మాల్ మోడల్. బడ్జెట్ అంతా బోగస్. అభయహస్తం కాదు రిక్త హస్తమని ప్రజలకు అర్థమైంది. పింఛన్ల పెంపు ఎప్పుడా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. పదవీ విరమణ ఉద్యోగులకు ప్రయోజనాలు లేవు. అన్ని కులాలకు, వర్గాలకు మొండిచేయి చూపారు.

**మూడేళ్లు కాకుండానే రూ.3.5 లక్షల కోట్ల అప్పులు**

మూడేళ్లు నిండకముందే రూ.మూడున్నర లక్షల కోట్ల అప్పులు చేశారు. అంత అప్పు చేసి ఒక్క రూపాయితో ఒక్క ప్రాజెక్టు అయినా నిర్మించారా? కేసీఆర్ కాళేశ్వరం కట్టారు. మిషన్ భగీరథ అమలు చేశారు. మెడికల్ కాలేజీలు కట్టించారు. కేసీఆర్ తాను తెచ్చిన అప్పులను మూలధన పెట్టుబడిగా మార్చి సంపద సృష్టించారు. మీరు వచ్చాక చరిత్రలో ఎన్నడూ లేనంతగా అప్పు పెరిగింది. 27 శాతం నుంచి 29 శాతానికి పెంచారు..' అని బీఆర్ఎస్ నేత విమర్శించారు.

**ఫిరాయింపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకుని..**

'ఫిరాయింపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకుని అంబేడ్కర్ సూక్తులు మాట్లాడటం సిగ్గుచేటు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని బూడిద నుంచి ఫీనిక్స్ పక్షిలాగా ఎగిరింప చేసింది. ఆ ఫీనిక్స్ పక్షిని బూడిద చేసిన పాపం మీది. స్కాంలు తప్ప స్కీంలు ఉన్నాయా? మేడారం టెండర్లలో ఏం జరిగిందో మీ కేబినెట్ మంత్రి కుమార్తెనే చెప్పారు. నాసిరకం పనులతో నాలుగు రోజులకే భాగోతం బయటపడింది. ఇండస్ట్రియల్ హబ్ కాదు.. కరప్షన్ హబ్‌గా మార్చారు. సింగరేణిని స్కాంల ఖనిగా, కుంభకోణాల కేంద్రంగా మార్చారు. గురుకులాల్లో తిండి పెట్టే దిక్కు లేదు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఆర్భాటాలు చేస్తున్నారు. మీ పాలనలో 167 మంది గురుకుల పిల్లలు చనిపోయారు.

**పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

ఏ కంపెనీ, ఎన్ని ఉద్యోగాలు, ఎంత పెట్టుబడులు అనే దానిపై శ్వేతపత్రం విడుదల చేయాలి. మీరు విదేశాలకు వెళ్లింది పెట్టుబడుల కోసం కాదు అక్రమ సంపాదన భద్రపరుచుకోవడానికి. డిప్యూటీ సీఎం భట్టి దేశ సగటు కన్నా తెలంగాణ జీఎస్డీపీ అధికంగా ఉందని అంటుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రం దివాళా తీసింది అంటున్నారు. ఇందులో ఏది నిజం? దేశం కంటే తెలంగాణ తలసరి ఆదాయం 1.9 శాతం ఎక్కువ అంటున్నారు. కానీ బీఆర్ఎస్ పాలనలో 14 శాతం ఉంటే, కాంగ్రెస్ పాలనలో 10 శాతం మాత్రమే. మా పాలనలో జీఎస్డీపీ వృద్ధి రేటు 12.5 శాతం ఉంటే, కాంగ్రెస్ పాలనలో 10.7 శాతానికి తగ్గింది.

**పాలనలో ఫెయిల్**

మీరు పాలనలో ఫెయిల్ అయ్యారు. హైడ్రా కూల్చివేతలు, మీ మూర్ఖత్వం వల్ల అభివృద్ధి ఆగిపోయింది. గతేడాది యాసంగిలో సన్నరకం వడ్లకు రూ.వెయ్యి కోట్లు ఎగ్గొట్టారు. భూముల మీద ఉన్న ప్రేమ ప్రజల మీద లేదు. కూల్చడం మీద ఉన్న ప్రేమ నిర్మాణం మీద లేదు. మేము నోటిఫికేషన్లు ఇస్తే.. నియామక పత్రాలు ఇచ్చి ఆ ఉద్యోగాలు మీరే ఇచ్చినట్లు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 6 లక్షల రేషన్‌కార్డులు ఇచ్చినట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబితే..భట్టి ఇవ్వలేదంటున్నారు..' అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

**మహాలక్ష్మిలో రూ.2,800 కోట్లు బకాయి**

'మహాలక్ష్మి కింద ప్రభుత్వం రూ.2,800 కోట్లు బకాయి పడింది. ఆర్టీసీకి రూ.9,222 కోట్లు ఇస్తే సంస్థ రూ.3 వేల కోట్ల అప్పులు ఎందుకు చేసింది? ఆర్టీసీ లాభాల్లో ఉంటే పింఛన్ బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదు? ఎందుకు కారేుకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదు?..' అని మాజీమంత్రి నిలదీశారు.

# కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ముందా?

ఈ బడ్జెట్‌ను 'మోసం, దగా, ప్రజా వంచన' బడ్జెట్‌గా అభివర్ణించారు. అంకెల ఆర్భాటాలు, ప్రగల్భాలు తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆదాయాన్ని పక్కనబెట్టి కేవలం అప్పుల కోసమే అర్రులు చాచే విధంగా ఈ బడ్జెట్ ఉందని.. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టిందని మండిపడ్డారు. బడ్జెట్‌లో విద్యా, వైద్య రంగాలను పూర్తిగా నాశనం చేశారని బండి సంజయ్ ఆరోపించారు. విద్యాశాఖకు 16 శాతం నిధులు కేటాయించాలని కమిషన్ ప్రతిపాదించినప్పటికీ కేవలం 8 శాతానికే పరిమితం చేయడం దారుణమన్నారు. విద్యా కమిషన్‌ను పట్టించుకోలేదని.. ముఖ్యమంత్రి వద్ద ఉన్న విద్యాశాఖకే దిక్కులేకుండా పోయిందని విమర్శించారు. ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో పేదలకు వైద్యం అందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత బడ్జెట్‌లో దేవాదాయ శాఖకు రూ.190 కోట్లు ఇస్తే.. ఈసారి ఆ ప్రస్తావనే లేదని.. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటితుడుపు కేటాయింపులు చేశారని మండిపడ్డారు. రైతు భరోసా విషయంలో ప్రభుత్వం రైతులను నిలువునా ముంచుతోందని సంజయ్ విమర్శించారు. ఆరు వాయిదాలకు గానూ కేవలం రెండు మాత్రమే ఇచ్చి.. మిగిలినవి ఎగ్గొట్టారని ధ్వజమెత్తారు. కౌలు రైతులకు ఇస్తామన్న రూ.15,000 ఏవని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, తులం బంగారం, రూ.4,000 పెన్షన్ పెంపు వంటి ఆరు గ్యారంటీల ఊసే లేదని.. వీటికి ఈ బడ్జెట్‌తో పాడె కట్టారని ఘాటుగా వ్యాఖ్యానించారు. విద్యార్థులకు ఇస్తామన్న రూ.5 లక్షల భరోసా కార్డులకు రూపాయి కూడా కేటాయించలేదని గుర్తు చేశారు. 56 శాతం ఉన్న బీసీలకు కేవలం 4 శాతం నిధులు ఇవ్వడం సామాజిక అన్యాయమన్నారు.



రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో రూ.2 లక్షల కోట్ల అప్పు చేసిందని.. ఇప్పుడు మరో లక్ష కోట్లు తెచ్చేందుకు సిద్ధమవుతోందని బండి సంజయ్ ఆరోపించారు. తెలంగాణ అప్పులు రూ.12 లక్షల కోట్లకు చేరితే రాష్ట్రం శ్రీలంకలా మారుతుందని హెచ్చరించారు. దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో ముఖ్యమంత్రి 'గాడిద గుడ్డు' పట్టుకొచ్చారని.. తెచ్చిన పెట్టుబడుల వివరాలు వెల్లడించే దమ్ముందా అని సవాల్ విసిరారు. రాష్ట్ర ఆదాయం పెంచే మార్గం చూపకుండా.. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తున్నారని విమర్శించారు. డ్రగ్స్ కేసు విచారణలో ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేదని.. అకుల్ సబర్వాల్ రిపోర్టును ఎందుకు బయటపెట్టడం లేదని సంజయ్ నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా ప్రభాకర్ రావు కుటుంబాలను నాశనం చేశారని.. ఆయనకు సుప్రీంకోర్టులో బెయిల్ రావడానికి ప్రభుత్వం సహకరించిందని ఆరోపించారు. కాళేశ్వరం విచారణ ఏమైందని.. కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము రేవంత్ రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకటేనని.. కేసీఆర్ కుటుంబాన్ని టచ్ చేసే ధైర్యం లేకపోతే చెప్పాలని.. తాము బీజేపీ అధికారంలోకి వచ్చాక అందరినీ అరెస్ట్ చేసి చూపుతామని సవాల్ విసిరారు.



# నిధుల మూట.. ప్రగతి బాట

రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా నిలబెడుతున్నాం. సుస్థిర రాజకీయ వ్యవస్థ, పటిష్ఠ ప్రణాళిక, దూరదృష్టి, ప్రజలకు మేలు చేయాలనే పట్టుదల మమ్మల్ని నడిపిస్తున్నాయి. బడ్జెట్ అంటే సంఖ్యల చుట్టూ తిరిగే అంకెలు కాదు, ప్రజల చుట్టూ తిరిగే సంఖ్యలు. ప్రజల జీవన స్థితిగతుల మార్పునకు దోహదపడే లెక్కలు. ప్రజల ఆశలు, ఆశయాలను నిజం చేసే సంకల్ప పత్రమే ఈ బడ్జెట్. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అద్దం పట్టేలా దీన్ని రూపొందించాం.

**దేశానికి బలమైన గ్రోత్ ఇంజిన్‌గా తెలంగాణ**

2025-6 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి ప్రస్తుత ధరల ప్రకారం రూ.17,82,198 కోట్లు. గత ఏడాదితో పోలిస్తే వృద్ధి రేటు 10.7 శాతంగా నమోదైంది. ఇదే సమయంలో దేశ జీడీపీ రూ.3,57,13,886 కోట్లుగా, వృద్ధిరేటు 8 శాతంగా ఉంది. తెలంగాణ వృద్ధి రేటు దేశ సగటు వృద్ధి రేటు కంటే 2.7 శాతం ఎక్కువగా ఉంది. దేశ జీడీపీలో రాష్ట్ర జీడీపీ 5 శాతం వాటా కలిగి దేశానికి ఒక బలమైన గ్రోత్ ఇంజిన్‌గా తెలంగాణ నిలుస్తోంది.

**గణనీయంగా పెరిగిన తలసరి ఆదాయం**

రాష్ట్ర తలసరి ఆదాయం గణనీయంగా పెరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931 కాగా, వృద్ధి రేటు 10.2 శాతం. అదే సమయంలో దేశ తలసరి ఆదాయం రూ.2,19,575 కాగా వృద్ధిరేటు కేవలం 6.9 శాతం. దేశ తలసరి ఆదాయంతో పోల్చితే తెలంగాణ తలసరి ఆదాయం 1.9 రెట్లు ఎక్కువ. ప్రస్తుతం 200 బిలియన్ డాలర్లుగా ఉన్న ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే ప్రణాళికలను రూపొందిస్తున్నాం.

**మరిన్ని కేంద్ర నిధులకు కృషి**

2014-15 నుంచి 2023-24 వరకు కేంద్ర ప్రాయోజిత పథకాల కింద బకాయి ఉన్న రూ.3 వేల కోట్లను విడుదల చేశాం. రాష్ట్ర అభివృద్ధి కోసం సహకార, సమాఖ్య వాద స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నాం. 2021-22లో రాష్ట్రానికి కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రూ.4,826 కోట్లు రాగా, మా ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటిదాకా రూ.7.72 వేల కోట్లను సాధించింది. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ మరిన్ని నిధులను సాధించడానికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుంది.

**గత ప్రభుత్వ అప్పులతో తీవ్ర భారం**

గత ప్రభుత్వ హయాంలో పరిమితులకు మించి చేసిన అప్పుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారం పడింది. ఈ తప్పిదాన్ని సరిదిద్దేందుకు గత ప్రభుత్వం అధిక వడ్డీకి తెచ్చిన రూ.25,612 కోట్ల రుణాలను తక్కువ వడ్డీకి మా ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. రుణ చెల్లింపుల వ్యవధిని పెంచి, అసలు చెల్లించాల్సిన కాలాన్ని 20-39 సంవత్సరాలకు పొడిగించింది. ఈ రుణ పునర్వ్యవస్థీకరణ ద్వారా 2025-26 నుంచి 2031-32 దాకా చెల్లించాల్సిన రూ.34.58 వేల కోట్ల రుణం రూ.11.915 వేల కోట్లకు తగ్గింది.

**లక్షల కోట్ల పెట్టుబడులు**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ప్రధాన రంగాలలో ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడానికి ఒక ముఖ్య వేదికగా నిలిచింది. దీని ద్వారా దాదాపు రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. దావోస్ వేదికగా ఆవిష్కరించిన 'నెక్స్‌ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030 వల్ల రూ.73,360 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. సింగపూర్, వియత్నాంకు చెందిన సంస్థల నుంచి మొత్తం రూ.1.3 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి.

**వ్యవసాయానికి ప్రాధాన్యం...**

దేశానికి అన్నం పెడుతున్న రైతు సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యమిస్తున్నాం. రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో వ్యవసాయ దిగుబడులలో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి రూ.23,179 కోట్లు ప్రతిపాదించాం.

**రూ.కోట్లలో మహిళలకు ఆదా**

ఉచిత బస్సు పథకం ద్వారా రాష్ట్రంలో మహిళలు రూ.9,222 కోట్లు ఆదా చేసుకున్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ ద్వారా రూ.752 కోట్ల మేర మహిళలకు ఆదా అయింది. గృహజ్యోతి పథకం ద్వారా ఇప్పటి వరకు 10.97 కోట్ల సున్నా బిల్లులు జారీ అయ్యాయి. ఫలితంగా రూ.3,954 కోట్లను ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లించింది.

**హైదరాబాద్ సమ్మిళిత, సమాన అభివృద్ధి**

హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. ఔటర్ అవతల, లోపల ఉన్న 20 మున్సిపాలిటీలను, 7 కార్పొరేషన్లను విలీనం చేస్తూ 3 కార్పొరేషన్లుగా మార్చి సమ్మిళిత, సమాన అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నాం. 30 వేల ఎకరాలలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి దానిని ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం పోర్టుకు అనుసంధానించేలా కొత్త జాతీయ రహదారిని ప్రతిపాదించాం. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని తయారు చేయడం కోసం ఇక్కడ స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. రాష్ట్రంలో గత రెండున్నరేళ్లలో 67,763 మంది నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించాం. దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నైపుణ్య ఆధారిత బ్లూ కాలర్ ఉద్యోగ అవకాశాలకు అవసరమైన మానవ వనరులను అందించడంలో రాష్ట్రాన్ని యావత్ ప్రపంచానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. సంపద సృష్టించి ప్రజలకు పంచడమే మా విధానం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఏమాత్రం నిధుల కొరత రాకుండా సమతుల్యంగా బడ్జెట్‌ను రూపొందించాం. పన్నులతో సామాన్యుడిపై భారం మోపకుండా, ఉన్న వనరులను సద్వినియోగం చేస్తూ, కొత్త సంపదను సష్టించి, దానిని ప్రజలకు పంచడమే మా ప్రజా ప్రభుత్వ ఆర్థిక విధానం. 'పేదవాడి కన్నీరు తుడిచిన నాడే నిజమైన అభివృద్ధి..' అన్న మహాత్మాగాంధీ మాటలను స్ఫూర్తిగా తీసుకుని పదేళ్ల విధ్వంసాన్ని సరిదిద్దేందుకు పునాది ఈ బడ్జెట్. ఈ పునాది ఆధారంగా ఒక సుందరమైన, సుసంపన్నమైన, ప్రశాంతమైన తెలంగాణను నిర్మించేందుకు ఇది బ్లూ ప్రింట్.

**డిజిటల్ జనగణనకు ముమ్మర ఏర్పాట్లు**

పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన, పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల ఏర్పాటు, రిజర్వేషన్ల అమలు వంటి ప్రజాస్వామ్య ప్రక్రియలకు మూలాధారమైన జనగణనను డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు రాష్ట్రంలో ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి జనగణన ఇది. 2026 మే 11 నుంచి జూన్ 9 వరకు జరగనుంది.

**తెలంగాణ ప్రజల ఆశాదీపం**

**బడ్జెట్ అంటే కేవలం సంఖ్యలు, అక్షరాలు మాత్రమే కాదు. మన జీవితం. మన భవిష్యత్తు**
**కలలు కనే యువతకు భవిష్యత్తుపై ఆశ కల్పించడం**
**ఆసరా కోసం చూసే బలహీనులను ఆదుకోవడం**
**నీడలేని వారికి నీడ కల్పించడం**
**పంట పొలాలకు నీళ్లు పారించడం.. ఫలసాయం పెంచడం**
**కష్టపడే వారికి పని కల్పించడం..ఇష్టపడేలా పాలన అందించడం**
**ఒక్క మాటలో చెప్పాలంటే ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశా దీపం.**
**రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం. పీడిత, తాడిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఇస్తున్న భరోసా.**

# రేషన్‌కార్డు ఉంటేనే కుటుంబ బీమా

న్న పిల్లలను పెద్దయ్యాక ఏమవుతావని అడిగితే ఐఏఎస్, ఐపీఎస్ అవుతానని చెబుతారని, అలాగే తాను సీఎంగా ఉన్నాను కాబట్టి, మళ్లీ వచ్చేసారి కూడా తానే సీఎంనని చెప్పినట్టు తెలిపారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత సీఎల్పీ సమావేశంలో మెజారిటీ ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే సీఎంను ఎన్నుకుంటారని స్పష్టం చేశారు. శుక్రవారం శాసనమండలి కమిటీ హాల్‌లో ఆయన మీడియాతో 'చిట్‌చాట్' చేశారు. సీఎం వ్యాఖ్యల్లోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.... పనోడిలా కేంద్రం నుంచి నిధులు తెప్పిస్తున్నా..: సీఎంగా కేంద్రం నుంచి నిధులు తేవడం కూడా ఓ పనే. నేను పాలకుడిని కాదు. సేవకుడిని. ప్రజలు ఐదేళ్ల కోసం ఓ పనోణ్ణి పెట్టుకున్నారు. గతంలో బాగా పనిచేస్తాడని పెట్టుకున్నాయన ఫాంహౌస్‌ల పడుకున్నందుకు ఆయన్ను మార్చారు. ఢిల్లీలో సీఎంకు కేంద్ర ప్రభుత్వం బంగ్లా ఎందుకిస్తుంది? గతంలో ఢిల్లీకి వెళ్లి రావాల్సిన నిధులు కూడా తెచ్చుకోలేదు. ఇప్పుడు అందుకు భిన్నంగా కేంద్ర ప్రాయోజిత పథకాల మీద దృష్టి పెట్టి సాధించుకుంటున్నాం. డీపీఆర్ సబ్‌మిట్ చేస్తే కేంద్రం 25 శాతం నిధులు ఇస్తది. మూసీకి కేంద్రం ఆమోదం తెలపలేదని ఎవరన్నారు? కేంద్రం ఆమోదం తెలిపితేనే మూసీనది ప్రక్షాళనకు ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణానికి ఒప్పుకుంది. మూసీ ప్రక్షాళన ఆగదు: మూసీనది ప్రక్షాళన ఆగదు. మూసీ బఫర్‌జోన్‌లో అటు ఇటు 50 మీటర్ల చొప్పున తీసుకొని అభివృద్ధి చేయాలి. 55 కిలోమీటర్ల మూసీ ప్రక్షాళన ప్రాజెక్టులో డిసెంబర్ 2024లో కన్సల్టెన్సీని అపాయింట్ చేస్తే 21 కిలోమీటర్లకు సంబంధించి లంగర్‌హౌస్ వరకు డీపీఆర్ రిపోర్టు ఇచ్చింది. అభివృద్ధి చేసే క్రమంలో ప్రజలకు జరిగే నష్టాన్ని ఎలా పూడ్చాలనేది చూడాలి. ఈ విషయంలో సూచనలు, సలహాలు ఇవ్వమని అడిగినం. పబ్లిక్ డొమైన్‌లో పెట్టినం.

**రేషన్‌కార్డు ఉంటేనే...**

రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు బీమా కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. అయితే రేషన్‌కార్డు కలిగిన కుటుంబాలకే రూ.5 లక్షల కుటుంబబీమా అమలు చేస్తాం. ప్రస్తుతం వ్యవసాయ భూమి కలిగిన రైతులకు కల్పిస్తున్న రూ.5 లక్షల బీమా సదుపాయాన్ని రేషన్‌కార్డు కలిగిన కుటుంబాలకు ఇస్తాం. అప్పుడు రైతుబీమా కూడా అందులోకే వస్తుంది. కుటుంబ ఆర్థిక స్తోమత నిర్ధారణకు రేషన్‌కార్డు ఒక్కటే కొలమానం.

**తెలంగాణ విద్యావిధానంలో సంస్కరణలు**

తెలంగాణ విద్యావిధానంలో మార్పులు తీసుకొస్తున్నాం. అందుకోసం దేశవ్యాప్తంగా అమలవుతున్న 10 ప్లస్ 2 విధానాన్ని తీసుకురావాల్సిన అవసరముంది. ఈ మేరకు విద్యాకమిషన్ ఇచ్చిన నివేదికను కె.కేశవరావు నేతృత్వంలోని ఓ కమిటీకి అప్పగించాం. ఈ కమిటీకి అభ్యంతరాలు, సూచనలు ఇస్తే, తుది నివేదిక ఇస్తుంది. దాన్ని అమలు చేసే బాధ్యత నాది.

**రూ.3.30 లక్షల కోట్ల పాత అప్పులు చెల్లించాం**

మేం అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబర్ 1 నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకు రూ.3.47 లక్షల కోట్లు అప్పుగా తెచ్చాం. అందులో రూ.3.30 లక్షల కోట్లు కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ కింద చెల్లించాం. ఇందులో రూ.44 వేల కోట్లు కాళేశ్వరం కోసం చేసిన అప్పులు చెల్లించాం. చేసిన మొత్తం అప్పుల్లో కేవలం రూ. 17 వేల కోట్లను మాత్రమే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాం.

**చట్టపరంగానే విచారణ**

ఫార్ములా-ఈ రేస్, ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేస్ ఏదైనా చట్టప్రకారంగానే విచారణ జరుగుతుంది. ప్రభాకర్‌రావు 20 నెలలు ఇండియాలోనే లేడు. ఆయన వచ్చిన తర్వాత జరిపిన విచారణలో ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటున్నాయి. ఆరువేల ఫోన్లు ట్యాప్ అయినట్టు తేలింది. అందులో భాగంగానే స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్నారు. ఫోన్‌టాపింగ్ కేసులో క్లీన్‌చిట్ ఇచ్చినట్టు హరీశ్‌రావు చెబుతుండడం తప్పు. చక్రధర్‌గౌడ్ పంజగుట్ట పీఎస్‌లో తనను హరీశ్‌రావు బెదిరించాడని చేసిన ఫిర్యాదుకు సంబంధించిన కేసు అది. హరీశ్‌రావు బెదిరించినట్టు చక్రధర్‌గౌడ్ నిరూపించలేనందున కేసును కొట్టేశారు. దీనికి ఫోన్‌ట్యాపింగ్ కేసుకు ఏ సంబంధం లేదు. టెలిఫోన్ టాపింగ్ కేసులో ఇంకా హరీశ్‌రావు విచారణనే జరగలేదు. ఈ కేసులో నా ఫోన్‌లు ట్యాప్ అయినట్టు విచారణాధికారులు నిర్ధారించి విచారణకు పిలిస్తే నేను కూడా వెళతా.

**హిల్ట్ పాలసీపై ఏ విచారణ కోరినా ఆదేశాలిస్తా**

హిల్ట్ పాలసీలో రూ.5 లక్షల కోట్లు అవినీతి జరిగిందని బీఆర్ఎస్ నేతలు రోజుకోమాట మాట్లాడుతున్నారు. హిల్ట్ కింద 9 వేల ఎకరాలు లే అవుట్ చేసినా, అక్కరకొచ్చేది 4 వేల ఎకరాలే. 1970 నుంచి పరిశ్రమల కోసం ఇచ్చిన భూములను వారు ఎప్పుడో సొంతం చేసుకున్నారు. భూ బదలాయింపులకు సంబంధించి డబ్బులు కట్టి ఇండ్రస్టియల్ జోన్ నుంచి మల్టీ జోన్‌కు మార్చుకునేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దాని మీద అర్థం పర్థం లేకుండా మాట్లాడుతున్నారు. మొత్తం 9 వేల ఎకరాల భూములను హిల్ట్ పాలసీలో అమ్మినా లక్ష కోట్లు రావు కాదు.

**మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు ఆపే ఉద్దేశం లేదు**

మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు ఆపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. జనాభా లెక్కల్లో అధికార యంత్రాంగం బిజీగా ఉండడంతో ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని ఆగాం. ఇక కొత్తగా హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్ల ఏర్పాటుకు జనాభా లెక్కలకు సంబంధం లేదు. జీహెచ్‌ఎంసీలో ఓఆర్ఆర్ లోపలి మునిసిపాలిటీలు, గ్రామాల విలీన ప్రక్రియ, కొత్తగా 300 డివిజన్ల ఏర్పాటు అనేది గత డిసెంబర్ నాటికే పూర్తయింది. మండలాలు, జిల్లాల పునర్విభజన ప్రక్రియ ఇప్పుడు ఉండదు. జనాభా లెక్కలు పూర్తయి, నియోజకవర్గాల పునర్విభజన అయిన తర్వాత ఏఏ మండలాలు, గ్రామాలు ఏఏ రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పరిధిలోకి వెళ్లాయో తేలిన తర్వాతే రిటైర్డ్ జడ్జితో కమిటీ ఏర్పాటు చేసి, లోపాలను సరిదిద్దుతాం.

**భూముల విక్రయానికి కాంగ్రెస్ వ్యతిరేకం కాదు**

రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వ భూములను విక్రయించాల్సి వస్తే అందుకు కాంగ్రెస్ ఏనాడూ అభ్యంతరం చెప్పలేదు. భూముల విక్రయం ద్వారా వచ్చిన డబ్బులను దుర్వినియోగం చేసినప్పుడే కాంగ్రెస్ వ్యతిరేకించింది. మూల ధన వ్యయం కోసం భూములు విక్రయించగా వచ్చిన సొమ్మును వాడుకోవచ్చు. ప్రభుత్వ భూములు, రెవెన్యూ, టీజీఐఐసీ, హిల్ట్ పాలసీ మొదలైన ఏ భూములనైనా అవసరానికి అనుగుణంగా విక్రయించొచ్చు

**బీఆర్ఎస్, బీజేపీ వేర్వేరు కాదు**


రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ వేర్వేరు కాదు. నేను బీఆర్ఎస్‌ను విమర్శిస్తే బీజేపీ బండి సంజయ్ స్పందిస్తాడు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన డ్రగ్స్, ఫాంహౌస్‌లో పోలీసులపై కాల్పులకు సంబంధించి బీజేపీ నాయకులు ఎక్కడైనా స్పందించారా? ఇంత పెద్ద సంఘటన జరిగినప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ మాట్లాడొద్దా?. జీవన్‌రెడ్డి విషయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చూసుకుంటారు. ఆపరేషన్ కగార్ కేంద్రానికి సంబంధించినది. రాష్ట్ర పరిధిలోకి రాదు. ఎమ్మెల్సీగా ఎన్నిక కావడానికి మంత్రి అజాహరుద్దీన్ ఉన్న గడువు ఏప్రిల్ 30. ఏప్రిల్ 29 వరకు కూడా ఆయన ఎమ్మెల్సీగా రావొచ్చు. అజాహరుద్దీన్, కోదండరాంకు సంబంధించిన ఎమ్మెల్సీల ఫైల్ గవర్నర్ పరిశీలనలో ఉంది.



# ఇంధన వనరులపై దాడుల్ని ఖండించిన మోదీ

**నౌకల రాకపోకలు స్వేచ్ఛగా సాగాల్సిన అవసరాన్ని, నౌకాయానానికి భద్రత కల్పించాల్సిన ఆవశ్యకతను ప్రధానమంత్రి మోదీ బహ్రెయిన్ రాజుతో జరిపిన టెలిఫోన్ సంభాషణలో నొక్కిచెప్పారు. "బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఈసా అల్ ఖలీఫాతో మాట్లాడాను. ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ఆయనకు, బహ్రెయిన్ ప్రజానీకానికి హార్దిక అభినందనలు తెలియజేశాను. మేమిద్దరం పశ్చిమాసియా పరిస్థితిపై చర్చించుకున్నాం. ఇంధన వనరులపై, పౌరుల మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులు ప్రపంచ ఆహార, ఇంధన భద్రతపై, ఎరువుల సరఫరాపై ప్రతికూల ప్రభావం చూపుతాయన్న అభిప్రాయంతో ఇరువురం ఏకీభవించాం" అని మోదీ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. బహ్రెయిన్‌లోని భారతీయ సంతతికి మద్దతు, సహాయ సహకారాలు అందిస్తున్నందుకు ఆ దేశాధినేతకు కృతజ్ఞతలు తెలియజేసినట్టు మోదీ చెప్పారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు దాడులు ప్రారంభించిన నాటి నుంచీ మోదీ బహ్రెయిన్ రాజుతో మాట్లాడటం ఇది రెండోసారి.**

## మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారం..
# సుప్రీం కోర్టుకు యాజమాన్యాలు



ఈకబురు , దిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారంపై వైద్య విద్య కళాశాలల యాజమాన్యాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28తో కౌన్సెలింగ్ ముగిసిందని, అప్పటికి ఏపీలో 246, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లాయి. వీటిలో ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని జస్టిస్ పీఎస్ నర్సింహా, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం దృష్టికి యాజమాన్యాల తరపు న్యాయవాదులు తీసుకొచ్చారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, కానీ, గడువు ముగియడంతో కౌన్సెలింగ్ ముగించారని కోర్టుకు వివరించారు. గడువు పెంచాలని ఫిబ్రవరి 28కి ముందే.. జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు విజ్ఞప్తి చేయగా.. ఎలాంటి సమాధానం రాలేదని కోర్టుకు న్యాయవాదులు వివరించారు. ఇదే పరిస్థితి తలెత్తితే.. కర్ణాటక, మహారాష్ట్రల్లో గడువు పెంచారని చెబుతూ.. సంబంధిత ఉత్తర్వులను కోర్టు ముందుంచారు. వైద్య విద్య కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఎన్ఎంసీకి ఆదేశిస్తూ.. తదుపరి విచారణను సర్వోన్నత న్యాయస్థానం మార్చి 23 (సోమవారం)కి వాయిదా వేసింది.

# రంగనాథస్వామి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న హరిశంకర్ యాదవ్

## ఘనస్వాగతం పలికిన బీఆర్ఎస్ నాయకులు



రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న హరిశంకర్ యాదవ్



స్థానిక నాయకులతో కలిసి రాగం హరిశంకర్ యాదవ్

ఈకబురు, శేరిలింగంపల్లి : నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి గ్రామంలో గల శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ఉగాది పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు భారీ ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఈ కార్యక్రమానికి నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు రాగం హరి శంకర్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హరిశంకర్ యాదవ్ కు స్థానిక బీఆర్ఎస్ నాయకులు శంకరి రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరి శంకర్ యాదవ్ మాట్లాడుతూ రంగనాథ స్వామి కృపతో నల్లగండ్ల డివిజన్ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి కుమార్, బి. అరుణ్, ఎన్. సాయినాథ్, నర్సింహ తదితరులతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎక్కడున్నా వదలం!



గల్ఫ్ దేశాల్లోని చమురు క్షేత్రాలపై దాడుల తీవ్రతను మరింతగా పెంచింది. కువైట్‌లో రెండు రిఫైనరీలపై డ్రోన్ దాడులకు దిగింది. దాంతో రోజుకు ఏకంగా 7.3 లక్షల బ్యారెళ్ల చమురు శుద్ధి చేసే మినా అల్ అహ్మదీ రిఫైనరీలో పలు యూనిట్లు మంటల్లో చిక్కాయి. వాటిని ఆర్పేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. కువైట్‌లోని మైనా అబ్దుల్లా చమురు క్షేత్రం కూడా దాడులకు గురైంది. ఈ రెండు క్షేత్రాలపై గురువారం కూడా ఇరాన్ దాడులు చేయడం తెలిసిందే.

సౌదీ అరేబియా, బహ్రెయిన్, దుబాయ్‌ల్లో కూడా భారీ బాంబుల మోతలతో దద్దరిల్లిపోయాయి. ఈ నేపథ్యంలో తన గడ్డపై ఉన్న ఇరాన్ సంస్థలన్నింటినీ మూసేయాలని దుబాయ్ నిర్ణయించుకుంది. ఇజ్రాయెల్‌లో హైఫాలో ఉన్న అతి పెద్ద చమురు శుద్ధి కేంద్రంపై కూడా ఇరాన్ భారీగా దాడులు చేసింది. దాంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి.

జెరూసలేం, టెల్ అవీవ్‌తో పాటు దేశవ్యాప్తంగా దాడులు కొనసాగాయి. బాలిస్టిక్ క్షిపణి తయారీ సామర్థ్యాన్ని కోల్పోయానన్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటనను ఇరాన్ ఖండించింది. ఇప్పటికీ భారీ సంఖ్యలో క్షిపణులను తయారు చేస్తున్నట్టు స్పష్టం చేసింది. గురువారం తన గగనతలంలో అమెరికాకు చెందిన ఎఫ్-35 యుద్ధ విమానంపై చేసిన దాడికి సంబంధించి వీడియో క్లిప్పింగ్‌ను కూడా విడుదల చేసింది. ఈ అత్యాధునిక స్టెల్త్ ఫైటర్ జెట్లు దాడికి గురికావడం వాటి చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం!

ఇరాన్‌పై బాంబుల వర్షం

పర్షియా నూతన సంవత్సరం 'నౌరోజ్' నాడు ఇరాన్‌పై ఇజ్రాయెల్ ముమ్మర దాడులు కొనసాగాయి. రాజధాని టెహ్రాన్‌తో పాటు పలు దేశవ్యాప్తంగా నగరాలు పేలుళ్లతో దద్దరిల్లిపోయాయి. టెహ్రాన్‌లోని బసీజ్ గ్రూప్ ప్రధాన కార్యాలయంపైనా బాంబుల వర్షం కురిపించింది. ఇరాన్‌లోని సౌత్ పార్స్ సహజ వాయు క్షేత్రంపై ఇక దాడులు చేయబోమని నెతన్యాహు ప్రకటించారు. గల్ఫ్‌కు మరో మూడు యుద్ధ నౌకలను తరలించాలని అమెరికా నిర్ణయించింది.

సిరియాపైనా దాడులు

ఇజ్రాయెల్ తన దాడులను లెబనాన్‌తో పాటు సిరియాకూ విస్తరించింది. స్వెయ్‌డాతో పాటు దేశవ్యాప్తంగా పేలుళ్లు జరిగినట్టు సిరియా ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. అక్కడి డ్రౌజ్ మైనారిటీలను కాపాడేందుకే ఈ చర్యకు దిగినట్టు ఇజ్రాయెల్ పేర్కొంది.

వారి భ్రమలు వీడాయి: మొజ్తబా

ఇరాన్ నాయకత్వాన్ని, అగ్ర నేతలను చంపినంత మాత్రాన ప్రభుత్వం తలకిందులైపోతుందని ఇజ్రాయెల్, అమెరికా భ్రమించాయని సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ ఎద్దేవా చేశారు. వాటిప్పుడు భ్రమలు వీడాయన్నారు. శత్రువుల రక్షణ కవచాలను ఛేదించాలని ఇరాన్ ప్రజలకు పిలుపునిచ్చారు. యుద్ధం మొదలై మూడు వారాలైనా వాళ్లు గొప్ప ధైర్యస్థైర్యాలు చూపుతున్నారంటూ కొనియాడారు. పర్షియన్ నూతన సంవత్సరం 'నౌరోజ్' సందర్భంగా మొజ్తబాను ఉటంకిస్తూ ఇరాన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆయన బతికే ఉన్నారంటూ ఒక వీడియోను కూడా విడుదల చేసింది. అందులో ఆయన పలువురికి మత బోధలు చేస్తూ కనిపిస్తున్నారు. అది ఎప్పటి వీడియో అన్నదానిపై మాత్రం స్పష్టత లేదు. యుద్ధం మొదలైనప్పటి నుంచీ మొజ్తబా ఇప్పటిదాకా బహిరంగంగా కనిపించకపోవడం తెలిసిందే. తండ్రి అయతొల్లా ఖమేనీ తదితరులను పొట్టన పెట్టుకున్న ఇజ్రాయెల్ దాడిలో ఆయన కూడా తీవ్రంగా గాయపడ్డట్టు వార్తలొస్తూనే ఉన్నాయి.

నాటో దేశాలు పిరికిపందలు: ట్రంప్

వాషింగ్టన్: నాటో దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వాటిని పిరికిపందలుగా అభివర్ణించారు. అమెరికా లేకుంటే నాటో కూటమి కేవలం కాగితం పులిగా మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు. ''చమురు ధరలు పెరుగుతున్నాయంటూ నాటో దేశాలు ఫిర్యాదు చేస్తున్నాయి. హార్మూజ్ జలసంధిని తెరిపిస్తే పరిష్కారమయ్యే చిన్న సమస్య అది. పైగా వాటికి పెద్దగా రిస్కు కూడా లేని వ్యవహారం. కానీ అందుకు ముందుకు రమ్మంటే మాత్రం ముఖం చాటేస్తున్నాయి. నాటో దేశాల ఈ పిరికిపంద చర్యను గుర్తు పెట్టుకుంటాం'' అంటూ హెచ్చరించారు.

ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి మృతి

ఇరాన్ సైన్యం అధికార ప్రతినిధి అలీ మొహమ్మద్ నైనీ శుక్రవారం ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. ఇజ్రాయెల్‌కు సర్‌ప్రైజ్ ఇస్తామంటూ ప్రకటనలు చేసిన గంటల వ్యవధిలోనే దాడులకు బలయ్యారు. అంతకు కొద్దిసేపటి ముందే ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటనను కూడా నైనీ ఎద్దేవా చేశారు. ఇరాన్ యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణి ఉత్పత్తి కార్యకలాపాలను ఇకపై ఎంతమాత్రమూ కొనసాగించజాలదన్న నెతన్యాహు వ్యాఖ్యలను దుయ్యబట్టారు.

హార్మూజ్ వద్ద ఇరాన్ నౌకలపై బాంబులు

హార్మూజ్‌ను తెరిపించే ప్రయత్నాలకు అమెరికా ఎట్టకేలకు శ్రీకారం చుట్టింది. దాని సమీపంలోని పలు ఇరాన్ నావికా దళ లక్ష్యాలను శుక్రవారం ధ్వంసం చేసినట్టు అమెరికా సైన్యం ప్రకటించింది. దాడులకు సంబంధించిన వీడియో క్లిప్పింగులను విడుదల చేసింది. ఇరాన్ నావికా, సైనికోత్పత్తి సదుపాయాలతో పాటు మిసైల్ లాంచర్ వ్యవస్థలను కూడా పూర్తిగా ధ్వంసం చేయడంపైనే దృష్టి పెట్టినట్టు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వెల్లడించారు.

హార్మూజ్ సుంకం!

రూ.18 కోట్లు చెల్లించిన ఓ నౌక ముందుగా ప్రకటించినట్టుగానే హార్మూజ్ జలసంధిని దాటేందుకు నౌకల నుంచి ఇరాన్ సుంకం వసూళ్లు ప్రారంభించింది. ఇందుకోసం ఒక చమురు నౌక రూ.18 కోట్లపై చిలుకు మొత్తం చెల్లించినట్టు లాయిడ్స్ లిస్ట్ శుక్రవారం వెల్లడించింది. అంతేగాక హార్మూజ్ గుండా తాను అనుమతించిన నౌకల రవాణాకు పకడ్బందీగా నమోదు వ్యవస్థను కూడా రివల్యూషనరీ గార్డ్ ప్రకటించింది.



# గోదావరిలో గల్లంతైన యువకులు...

ఈకబురు : భద్రాచలం,: తెలంగాణ, ఏపీ సరిహద్దుల్లోని గోదావరిలో మునిగి ఐదుగురు యువకులు గల్లంతయ్యారు. ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. ప్రమాదం నుంచి బయటపడ్డ వారి మిత్రులు, పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీలోని కృష్ణాజిల్లా అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, కేఎల్‌యూలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఐదుగురు యువకులు గురువారం స్వామి వారి దర్శనం కోసం భద్రాచలం వచ్చారు. రామయ్య దర్శనం చేసుకొని రాత్రి అక్కడే బస చేశారు. శుక్రవారం ఉదయం వారు భద్రాచలంలోని తమ ఇద్దరు స్నేహితులతో కలిసి తెలంగాణఆంధ్రా సరిహద్దుల్లోని భద్రాచలానికి సమీపంలో ఉన్న కొల్లుగూడెం గోదావరి ఇసుక ర్యాంపు వద్ద స్నానాలు చేసి.. అనంతరం సరదాగా ఫొటోలు దిగాలని భావించారు. కానీ అక్కడ గోదావరిలో నీరు లేకపోవడంతో ఇసుకలో సుమారు రెండున్నర కిలోమీటర్లు నడిచి అవతలివైపు రాళ్లగుట్టలతో ఉన్న గోదావరి వద్దకు వెళ్లారు. అక్కడ కృష్ణా జిల్లా కలిదిండి గ్రామానికి చెందిన చందూరి దీపక్ మినహా మిగిలిన ఆరుగురు ఒకరి చేతులు ఒకరు పట్టుకొని నదిలో మధ్యలో ఉన్న రాళ్లగుట్టలపైకి వెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ గోదావరి లోతును అంచనా వేయలేక నీళ్లలోకి జారారు. తొలుత ఏపీలోని కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన తేజ్ణ సాయి(19) మునిగిపోతుండగా అతడిని కాపాడేందుకు ఇతర స్నేహితులు ప్రయత్నించారు. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన పాశం సతీశ్ కుమార్(19), భద్రాచలానికి చెందిన చారుగుళ్ల శ్రీకర్ (21), పొడిచేటి అభిరామ్ (19), కృష్ణాజిల్లా ఉయ్యూరు చెందిన దగ్గుపాటి నవదీప్ (19) గల్లంతయ్యారు. విజయనగరానికి చెందిన గడ్డం హర్షవర్ధన్ వారిని కాపాడేందుకు ప్రయత్నించే సమయంలో భయాందోళనకు గురై ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. అప్పటికే ఒడ్డున ఉన్న దీపక్‌తో పాటు హర్షవర్ధన్ తీవ్ర భయాందోళనకు గురై గల్లంతైన చారుగుళ్ల శ్రీకర్ తండ్రి రామకృష్ణకు, పోలీసులకు సమాచారం అందించారు.

భద్రాచలంతో పాటు ఏపీలోని యటపాక, వేలేరుపాడు, కుక్కునూరు పోలీసు అధికారులు ఘటనా అక్కడికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణ అగ్నిమాపక శాఖ రెస్క్యూ బృందంతో పాటు భద్రాచలం గోదావరి గజ ఈతగాళ్లు గాలింపు చర్యలను చేపట్టారు. గోదావరి నదిలో ఐదుగురు గల్లంతు కాగా అందులో ముగ్గురి మృతదేహాలు గజ ఈతగాళ్లకు లభ్యమయ్యాయి. దగ్గుపాటి నవదీప్, చారుగుళ్ల శ్రీకర్, పొడిచేటి అభిరామ్ మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను భద్రాచలం ఏరియా వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల కుటుంబసభ్యుల రోదనలతో గోదావరి తీరం మిన్నంటింది. మృతుల్లో ఒకరైన భద్రాచలానికి చెందిన పొడిచేటి అభిరామ్ రామాలయంలో వైదిక సేవల్లో పాల్గొంటుండగా ఏప్రిల్‌లో అధికారికంగా వైదిక ఉద్యోగిగా విధుల్లోకి తీసుకోవాల్సి ఉందని దేవస్థానం వర్గాల ద్వారా తెలుస్తోంది. అభిరామ్ తాత భద్రాద్రి దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకుడు పొడిచేటి రామచంద్రాచార్యులు కాగా తండ్రి వంశీ ఐటీసీలో మేనేజరుగా పని చేస్తున్నారు. చారుగుళ్ల శ్రీకర్ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా ఆయన తండ్రి వ్యాపార రంగంలో ఉన్నారు.


# కాంగ్రెస్ బడ్జెట్ అంకెల గారడీ

అత్యంత నిరాశాజనకంగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. ఆర్థిక మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బహుశా పొరపాటున గత ఏడాది బడ్జెట్‌నే చదివారేమో అన్న అనుమానం కలుగుతోందని, ఎందుకంటే పోయినసారి బడ్జెట్ కన్నా ఇందులో పెద్దగా మార్పులు చేర్పులు ఏమీ లేవని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటినా, ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో, ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పుకోవడానికి ఒక్క రిజల్ట్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా విద్యా రంగానికి ఈ బడ్జెట్‌లో తీరని అన్యాయం జరిగిందని రాంచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగానికి గత ఏడాది కంటే రూ. 1000 కోట్లు పెంచినట్లు చూపిస్తున్నా, ఓవరాల్ బడ్జెట్‌లో దీని వాటా కేవలం 8 శాతం మాత్రమేనని గుర్తు చేశారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ (13%), బీహార్ (21%) తమ బడ్జెట్‌లో విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతలో సగం కూడా తెలంగాణ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. 'ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీలు' అని గొప్పలు చెప్పడం తప్ప, విద్యా వ్యవస్థను మెరుగుపరిచే ఒక్క ప్రయత్నం కూడా కనిపించడం లేదన్నారు. ఆరోగ్య రంగం విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అట్టడుగున ఉందని నిలదీశారు. ఆరోగ్యశ్రీ బకాయిలే ఇంకా చెల్లించలేని రేవంత్ ప్రభుత్వం, పెన్షన్లు, ఇతర బెనిఫిట్లను కూడా ఆరోగ్యశ్రీ డిపార్ట్‌మెంట్‌కే అప్పగించడం అంటే ఆ సంస్థను కూడా దివాళా తీయించడమేనని హెచ్చరించారు. అభివృద్ధి ఎక్కడ జరుగుతుందో చెప్పకుండా 'ఫ్యూచర్ సిటీ' అని ఫ్యాన్సీ పేర్లతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన ఘనతగా చెప్పుకుంటున్న ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ అన్నీ కేంద్రంలోని నరేంద్ర మోదీ గారి ప్రభుత్వం ఇచ్చే పథకాలతో పాటు, 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా' పథకాల వల్ల వచ్చినవేనని స్పష్టం చేశారు. రీజనల్ రింగ్ రోడ్ (RRR), దాని పక్కన వచ్చే రీజనల్ రింగ్ రైల్ కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఫండింగ్ అని, కేవలం భూసేకరణ తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని ఎండగట్టారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGA) స్థానంలో, 'వికసిత భారత్ 2047' దార్శనికతకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం "వికసిత్ భారత్ - రోజ్ గార్ అజీవికా మిషన్ (గ్రామీణ)" (VBGRAM JI) చట్టం-2025ను తీసుకువచ్చింది. ఈ నూతన చట్టం ద్వారా లబ్ధిదారులకు నేరుగా రూపాయికి రూపాయి అందుతుందని ఆయన వెల్లడించారు. గతంలో కాంగ్రెస్ ప్రధాని రాజీవ్ గాంధీ గారే స్వయంగా కేంద్రం రూపాయి పంపిస్తే.. లబ్ధిదారులకు చేరేసరికి 15 పైసలు మాత్రమే మిగులుతున్నాయని అన్నారని గుర్తు చేస్తూ, నేడు నరేంద్ర మోదీ గారి పాలనలో ఆ పరిస్థితి లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పంపే ప్రతి పైసా నేరుగా పేదవాడి ఖాతాకే చేరుతోందని అన్నారు. రైతుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు ఆడుతోందని రాంచందర్ రావు మండిపడ్డారు. ఐదు దఫాలుగా రైతు భరోసా ఇవ్వాల్సి ఉండగా, సరిగ్గా ఇవ్వకుండా.. ఇంకా ప్రతి రైతుకు ఇంకా సుమారు ఎకరాకు రూ. 45,000 కి పైగా బాకీ పడి ఎగ్గొట్టారని విమర్శించారు. నిరుద్యోగులకు ఇస్తామన్న రూ. 4000 నిరుద్యోగ భృతి కానీ, మహిళలకు ఇస్తామన్న రూ. 2500 ఆర్థిక సాయం గురించి కానీ ఈ బడ్జెట్‌లో ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించి ఈ బడ్జెట్‌లో చోటు లేకపోవడం ప్రజలను వంచించడమేనన్నారు. కాంగ్రెస్ సర్కారు మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లను కూలగొట్టడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ కాలంలో సంజయ్ గాంధీ ఢిల్లీలో తుర్క్మాన్ గేట్ వద్ద పేదల ఇళ్లు కూలగొట్టిన 'మైండ్ సెట్' తోనే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని దుయ్యబట్టారు. మూసీ ప్రాజెక్ట్ వ్యయం రెండు రోజుల్లోనే రూ. 5000 కోట్ల నుండి రూ. 7000 కోట్లకు ఎలా పెరిగిందని రాంచందర్ రావు నిలదీశారు. ఇదంతా ఒక ప్లానింగ్ లేని విధానమని, కేవలం దోచుకోవడానికేనని ఆరోపించారు. దేవాలయాల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని రాంచందర్ రావు విమర్శించారు. అర్చకుల వేతనాలు పెంచాలని, ధూప దీప నైవేద్యాలకు బడ్జెట్ పెంచాలన్న డిమాండ్లను పట్టించుకోకుండా, కేవలం మైనారిటీ బడ్జెట్‌ను రూ. 700 కోట్లు పెంచడం ఓటు బ్యాంక్ పాలిటిక్స్‌లో భాగమేనన్నారు. హైదరాబాద్ నగరాన్ని మూడు ముక్కలు చేసి జీహెచ్ఎంసికి బడ్జెట్ కేటాయించకుండా అభివృద్ధి ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. ఓవరాల్‌గా ఈ బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని, పేదలకు దూరంగా ఉన్న ఈ 'ఫెయిల్డ్ బడ్జెట్'ను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని రాంచందర్ రావు గారు స్పష్టం చేశారు

# 300 బెట్టింగ్ వెబ్‌సైట్లు.. యాప్స్ పై నిషేధం

**ఈ-కబురు, ఢిల్లీ: అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌పై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. 300 బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌పై నిషేధం విధించింది. వీటిలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్, బెట్టింగ్ ఎక్స్ఛేంజీలు, సట్టా/మట్కా గ్యాంబ్లింగ్ నెట్‌వర్క్‌లు, రియల్‌మనీ కార్డ్-కెసినో గేమ్ యాప్స్ ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు ఇలాంటి 8,400 వెబ్‌సైట్లు, యాప్స్‌ను నిషేధించింది. బెట్టింగ్, ఆన్‌లైన్ జూదం కారణంగా యువత పెడదోవ పట్టడం, ఆర్థికంగా చితికిపోతున్నట్లు గ్రహించిన కేంద్ర ప్రభుత్వం.. గతేడాది అక్టోబర్‌లో ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్, 2025ను తీసుకొచ్చింది. నగదుతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించింది. ఈ చట్టం అమల్లోకి వచ్చాక 4900 వెబ్‌సైట్లు/యాప్‌లపై చర్యలు చేపట్టింది.**

# కాంగ్రెస్ బడ్జెట్ ఒక 'డీప్ ఫేక్'



**ఈ-కబురు , హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2026పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఘాటుగా స్పందించారు. ఈ బడ్జెట్ ప్రజలను ఏమాత్రం ఆకట్టుకునేలా లేదని, ఇది కేవలం 'ఫేక్ బడ్జెట్' అని అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 3,24,234 కోట్ల బడ్జెట్‌లో ప్రజా ఆమోదం పొందే అంశాలేవీ లేవని ఆమె విమర్శించారు. తెలంగాణ జాగృతి నిపుణుల బృందం అంచనా వేసిన విధంగానే బడ్జెట్ అంకెలు ఉన్నాయని, కానీ కేటాయింపుల్లో మాత్రం ప్రభుత్వం దారుణంగా విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం 4 శాతం నిధులు మాత్రమే కేటాయించడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో బీసీల కోసం ఏటా రూ. 20,000 కోట్లు కేటాయిస్తామని రాహుల్ గాంధీ, సోనియా గాంధీ హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు కేవలం రూ. 12,511 కోట్లు మాత్రమే కేటాయించి బీసీలను వంచించారని దుయ్యబట్టారు. ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, కార్పొరేషన్లు, షాపింగ్ కాంప్లెక్స్ వంటి హామీలు ఎక్కడా అమలు కాలేదని విమర్శించారు. గ్లోబలైజేషన్‌లో అంతరించిపోతున్న కులవృత్తులను ఆదుకునే ఆలోచన ప్రభుత్వానికి లేదని, కేవలం తెలంగాణ జాగృతి మాత్రమే వారి గురించి ఆలోచిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో మొదటిసారిగా ఎస్టీ (గిరిజన), మైనారిటీ మంత్రులు లేకుండా మంత్రివర్గం కొనసాగడం దారుణమని కవిత అన్నారు. లంబాడాలు లేని మంత్రివర్గం గతంలో ఎప్పుడూ లేదని, కనీసం ఎస్టీలకు ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం గిరిజనులను అవమానించడమేనని ఆమె పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లుగా మైనారిటీలకు మంత్రి పదవి కోసం తాము పోరాటం చేస్తున్నామని, అజారుద్దీన్‌ను హడావుడిగా తీసుకువచ్చినప్పటికీ, ఎస్టీల విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి గత బడ్జెట్‌లో రూ. 12,000 కోట్లు కేటాయిస్తే, ఇప్పుడు దాన్ని రూ. 5,500 కోట్లకు తగ్గించడం పేదలను మోసం చేయడమేనని కవిత విమర్శించారు. 22.5 లక్షల ఇళ్లు ఇస్తామని చెప్పి ఇంత తక్కువ నిధులు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. అలాగే, రైతు భరోసా, చేయూత పెన్షన్లు, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలకు గత ఏడాది కేటాయించిన నిధులనే ఈసారి కూడా అక్షరం పొల్లుపోకుండా కాపీ పేస్ట్ చేశారని ఎద్దేవా చేశారు. ఇది విజన్ ఉన్న బడ్జెట్ కాదని, కేవలం రివిజన్ బడ్జెట్ అని ఆమె చురకలంటించారు. నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును కవిత తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణలో డిగ్రీ చేసిన ప్రతి నలుగురు యువకుల్లో ఒకరికి, ఇద్దరు యువతుల్లో ఒకరికి మాత్రమే ఉద్యోగం దక్కుతోందని అజీం ప్రేమ్ జీ యూనివర్సిటీ సర్వే చెబుతోందని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ అశోక్ నగర్ వచ్చి నిరుద్యోగులను మోసం చేశారని, అందుకే ఆయనకు 'రాహుల్ ఫేక్' అని నామకరణం చేస్తున్నామని ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీ వెబ్ సైట్‌లో 68,000 మంది ఎన్రోల్ అయ్యారని తప్పుడు సమాచారం ఇస్తున్నారని, వాస్తవానికి అక్కడ ఉన్నది కేవలం 920 మంది మాత్రమేనని ఆమె ఆధారాలతో సహా నిరూపించారు. రాష్ట్ర అప్పుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర అప్పు రూ. 8,64,198 కోట్లకు చేరుకుందని, అంటే రాష్ట్రంలో ప్రతి వ్యక్తిపై రూ. 2.16 లక్షల అప్పు భారం పడిందని వివరించారు. ఒక్కో కుటుంబంపై దాదాపు రూ. 9 లక్షల అప్పును కాంగ్రెస్ ప్రభుత్వం నెత్తిన పెట్టిందని మండిపడ్డారు. కేంద్రం నుంచి రావాల్సిన రూ. 22,000 కోట్ల నిధులను రాబట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, కేవలం 50 శాతం నిధులు మాత్రమే సాధించగలిగిందని విమర్శించారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామంటున్న ప్రభుత్వం, 'స్త్రీ నిధి'లో జరుగుతున్న అక్రమాలను పట్టించుకోవడం లేదని కవిత ఆరోపించారు. 14 ఏళ్లుగా ఎండిగా కొనసాగుతున్న విద్యాసాగర్ రెడ్డి అక్రమాలకు పాల్పడుతున్నారని, సీతక్క గారు వెంటనే స్పందించి ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 1.5 లక్షల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. చివరగా, నిరుద్యోగులు చేపట్టిన అసెంబ్లీ ముట్టడికి తెలంగాణ జాగృతి సంపూర్ణ మద్దతు ఇస్తుందని కవిత స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లోని ఉద్యోగులకు గుడ్‌న్యూస్..
# HRA మినహాయింపు పరిమితి పెంపు




హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న వారికి కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. ఇంటి అద్దెభత్యం (HRA) మినహాయింపు పరిమితిని 50 శాతానికి పెంచింది. ఈ మేరకు ఆదాయపు పన్ను నిబంధనలు, 2026ను కేంద్రం శుక్రవారం నోటిఫై చేసింది. ఆరు దశాబ్దాల పాత ఆదాయపు పన్ను చట్టం1961 స్థానంలో.. కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఏప్రిల్ 1 నుంచి రాబోయే కొత్త నిబంధనలను నోటిఫై చేస్తూ గెజిట్ జారీ చేసింది.

గతంలో ముంబయి, కోల్‌కతా, దిల్లీ, చెన్నైలను మాత్రమే మెట్రో నగరాలుగా పరిగణించేవారు. ఆయా నగరాల్లో హెచ్ఆర్ఏ మినహాయింపు పరిమితి 50 శాతంగా ఉండేది. తాజాగా ఈ జాబితాలోకి హైదరాబాద్, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్‌ను కూడా చేర్చారు. అంటే 8 నగరాల్లో నివసిస్తున్న ఉద్యోగులు తమ జీతంలో 50 శాతం వరకు హెచ్ఆర్ఏ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. మిగిలిన వారికి యథాతథంగా 40 శాతం కొనసాగుతుంది. కొత్త ఆర్థిక సంవత్సరంలో అంటే 2027 జులైలో ఫైల్ చేయబోయే రిటర్నుల సమయంలో ఇది వర్తిస్తుంది.

పాత పన్ను విధానంలో పన్నును తగ్గించుకోవడానికి ఈ మార్పు ఉపయోగపడుతుంది. కొత్త పన్ను విధానం ఎంచుకున్న వారు ఈ మినహాయింపు పొందలేరు. అలాగే, హెచ్ఆర్ఏ మినహాయింపు పొందాలంటే ఇకపై పన్ను చెల్లింపుదారులు తాము నివసిస్తున్న ఇంటి యజమానితో (ల్యాండ్‌లార్డ్) తమకు ఉన్న సంబంధాన్ని (Relationship) తప్పనిసరిగా వెల్లడించాల్సి ఉంటుంది. ఫారం 124లో ఆ వివరాలు నమోదు చేయాలి.

పార్లమెంట్ ఆగస్టు 12న కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. సంక్లిష్టంగా ఉన్న ఆదాయపు చట్టాన్ని సులభతరం చేయడం దీని ఉద్దేశం. పాత ఆదాయపు పన్ను చట్టంలో 819 సెక్షన్లు ఉండగా.. కొత్త దాంట్లో 536కు కుదించారు. అలాగే చాప్టర్లను సైతం 47 నుంచి 23కు తగ్గించారు. పాత ఆదాయపు పన్ను చట్టంలో 5.12 లక్షల పదాలు ఉండగా దాన్ని.. దాదాపు సగానికి అంటే 2.6 లక్షలకే పరిమితం చేశారు. అదనంగా 39 కొత్త టేబుళ్లు 40 ఫార్ములాలను జోడించారు.

## తగ్గుతున్న బంగారం ధరలు..
# మళ్లీ పెరుగుతాయా?



ఇరాన్.. అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కొనసాగుతున్నప్పటికీ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిసాయి. బంగారం ధరలు గత కొంత కాలంగా తగ్గుతూ.. ఈ రోజు స్వల్పంగా పెరిగాయి. ఈ విలువైన లోహాల ధరలు పడిపోతూనే ఉంటాయా? లేక మళ్లీ పెరుగుతాయా? అనే సందేహం చాలామందిలో కలిగింది. ఈ కథనంలో ఆ వివరాలు తెలుసుకుందాం.

ఈ రోజు (మార్చి 20) బంగారం ధర 0.6% పెరగగా, వెండి ధర 1.7% ఎందుకు తగ్గింది. ఇటీవలి తగ్గుదలల తర్వాత, సాంకేతిక కొనుగోళ్లు మార్కెట్‌కు మద్దతు ఇవ్వడంతో శుక్రవారం బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. బలమైన అమెరికన్ డాలర్ ఒత్తిడి, వడ్డీ రేట్లపై యూఎస్ ఫెడరల్ రిజర్వ్ నుండి వస్తున్న సంకేతాల కారణంగా, గోల్డ్ వరుసగా మూడవ వారం కూడా పతనం దిశగా పయనించింది. అదే సమయంలో, మార్కెట్‌లో బలహీనమైన డిమాండ్‌ను ప్రతిబింబిస్తూ వెండి ధరలు తగ్గాయి. భౌగోళిక రాజకీయ పరిణామాలు, చమురు ధరల కదలికలు, భారతదేశం.. చైనాలలో భౌతిక డిమాండ్‌లో మార్పులతో సహా ప్రపంచ కారకాలు బంగారం, వెండి ధరలను గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇటీవలి తగ్గుదలల తర్వాత వ్యాపారులు కొనుగోళ్లు జరపడం, ధరలు సాంకేతిక మద్దతు జోన్‌లను నిలబెట్టుకోవడంతో బంగారం ధరలు పెరిగాయి. అయితే, భౌతిక డిమాండ్ తగ్గడం మరియు కొనసాగుతున్న అమ్మకాల కార్యకలాపాల కారణంగా వెండి ధరలు పడిపోయాయి. ఆసియా ట్రేడింగ్ సమయంలో స్పాట్ గోల్డ్ 0.6% పెరిగి ఔన్సుకు 4,675.23 డాలర్లకు చేరుకుంది. గత సెషన్‌లో దాదాపు రెండు నెలల కనిష్ట స్థాయికి పడిపోయిన ఈ లోహం కోలుకుంది. వెండి 1.7% తగ్గి ఔన్సుకు 71.66 డాలర్లకు చేరింది. ఇతర లోహాలు మిశ్రమ కదలికలను కనబరిచాయి. ప్లాటినం 0.2% పెరిగి 1,974.45 డాలర్లకు చేరగా, పల్లాడియం 1% పెరిగి 1,461.36 డాలర్లకు చేరింది.

**బంగారం ధరల పెరుగుదల ఎప్పుడు**

బంగారం వంటి విలువైన లోహాల విలువ ఎలాంటి సమయంలో అయినా భారీగా క్షీణించే అవకాశం ఉండదు. స్టాక్ మార్కెట్లు కుప్పకూలిపోవచ్చు, ఆర్థిక మాంద్యం రావచ్చు. అలంటి సమయంలో కూడా మీకు బంగారం, వెండి వంటివి చాలా ఉపయోగపడతాయని రాబర్ట్ కియోసాకి వంటి నిపుణులు చెబుతున్నారు.



## ఫ్లిప్‌కార్ట్ సీఎఫ్ఓ రాజీనామా

పబ్లిక్ లిస్టింగ్‌కు ముందు, ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ (సీఎఫ్ఓ) ఆఫీసర్ శ్రీరామ్ వెంకటరామన్ తన పదవికి రాజీనామా చేశారని కంపెనీ తెలిపింది. తదుపరి సీఎఫ్ఓ నియామకం వరకు.. రవి అయ్యర్ ఈ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారని సంస్థ వెల్లడించింది.

"శ్రీరామ్ నాయకత్వ బృందంలో ఒక సభ్యుడిగా ఉంటూ.. ఇన్నేళ్లుగా సంస్థ ఆర్థికంగా ముందుకు సాగడంతో కీలక పాత్ర పోషించారు. ఆయన చేసిన సేవలకు ధన్యవాదాలు తెలుపుతూ.. భవిష్యత్తులో ఆయన మరింత రాణించాలని ఆకాంక్షిస్తున్నాము" అని గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కళ్యాణ్ కృష్ణమూర్తి అన్నారు.

ఐపీఓ లక్ష్యంగా..

2025 డిసెంబర్‌లో ఫ్లిప్‌కార్ట్ తన అధికారిక చిరునామాను చట్టపరంగా సింగపూర్ నుంచి భారతదేశానికి మార్చడానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) నుంచి అనుమతి పొందింది. దేశీయ స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ కావాలనే ప్రణాళికలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకుంది. ఫ్యాషన్, ఆరోగ్యం, లాజిస్టిక్స్ వంటి వివిధ విభాగాలను సరళీకృతం చేస్తూ సింగపూర్‌కు చెందిన ఎనిమిది సంస్థలను ఫ్లిప్‌కార్ట్ ఇంటర్నెట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో విలీనం చేసింది.

## ప్లాట్‌ఫామ్ ఫీజు
# పెంచిన జొమాటో

ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో (Zomato) ప్లాట్‌ఫామ్ ఫీజును పెంచింది. కంపెనీ యాప్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. వినియోగదారులు ఒక్కో ఆర్డర్‌కు ఇక నుంచి రూ.2.40 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఇప్పటికే వసూలు చేస్తోన్న ఫీజు రూ.12.50 నుంచి రూ.14.90కి పెరిగింది. జొమాటో, దాని పోటీ సంస్థ స్విగ్గీ ఒకే తరహా ధరల ట్రెండ్‌ను అనుసరిస్తుంటాయి. అన్ని పన్నులు కలుపుకొని ప్రస్తుతం స్విగ్గీ వసూలు చేస్తోన్న ప్లాట్‌ఫామ్ ఫీజు రూ.14.99గా ఉంది.

కాగా.. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చమురు ధరలు భగ్గుమంటున్నాయి. పెరుగుతోన్న ఇంధన ధరలు డెలివరీ కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఫీజు పెంపునకు అది ఓ కారణంగా కనిపిస్తోంది. ఇదిలా ఉంటే.. వేగంగా విస్తరిస్తోన్న ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ అదే స్థాయిలో ఉంది. ప్రముఖ క్యాబ్ బుకింగ్ సేవల సంస్థ ర్యాపిడో.. ఓన్లీ (Ownly) పేరిట బెంగళూరులో ఇటీవల ఫుడ్ డెలివరీ సేవలను లాంచ్ చేసింది. డెలివరీ ఫీజు తప్ప మిగతా రెస్టారెంట్లు, వినియోగదారుల నుంచి ఎలాంటి అదనపు రుసుములు వసూలు చేయబోమని చెప్తోంది. ఈ ప్రకటన ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న సంస్థలపై ఒత్తిడి పెంచేదే.

# భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు

- లీటరుకు రూ.2 మేర పెరిగిన ప్రీమియం పెట్రోల్
- వచ్చే వారం తప్పని పెట్రోల్ మోత?
- లీటరుకు రూ.3 నుంచి రూ.5 వరకు పెరిగే చాన్స్
- పశ్చిమాసియా పరిస్థితులే ప్రధాన కారణం



డీజిల్‌పైనా వడ్డింపు తప్పదంటున్న చమురు సంస్థలు!

భారత్‌లో ప్రీమియం పెట్రోల్ ధరలు పెరిగాయి. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (HPCL) తన ప్రీమియం పెట్రోల్ ధరను లీటరుకు రూ .2 పెంచింది. సవరించిన రేట్లు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ప్రభుత్వ రంగ పెట్రోలియం కంపెనీ ఈ పెంపు వెనుక ఎటువంటి కారణాన్ని పేర్కొనపప్పటికీ, కొనసాగుతున్న ఇరాన్‌యుఎస్ వివాదం మధ్య ప్రపంచ ముడి చమురు ధరలలో హెచ్చుతగ్గులు, లాజిస్టిక్స్ ఖర్చులలో మార్పులే ఈ నిర్ణయానికి కారణమని భావిస్తున్నారు.

ఇక హైదరాబాద్‌లో ఈ ధరలు కనిష్ఠంగా రూ.2.26 మేర పెరిగినట్లు పెట్రోల్ డీలర్స్ చెబుతున్నారు. అయితే.. ట్రాన్స్‌పోర్టేషన్ ఖర్చు మేరకు ఒక్కో బంకులో ఒక్కోరకంగా ధరల్లో తేడాలు ఉండే అవకాశాలున్నాయని వివరిస్తున్నారు. అంటే.. అయిదు నుంచి పది పైసల మేర ఈ తేడా ఉంటుందని వెల్లడించారు. సాధారణ పెట్రోల్ వాడే సామాన్యులకు మాత్రం ఈ పెంపు నుంచి ఉపశమనం లభించింది. హెచ్‌పీసీఎల్ సాధారణ పెట్రోల్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. అంతేకాకుండా, చమురు సరఫరాలో ఎటువంటి అంతరాయం లేదని సంస్థ స్పష్టం చేసింది. "అదనపు సరకు రవాణా ఇప్పటికే మార్గంలో ఉంది. రాబోయే రోజుల్లో దేశీయ సరఫరా మరింత బలోపేతం అవుతుంది. ప్రజలు పుకార్లను నమ్మవద్దు" అని హెచ్‌పీసీఎల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా విజ్ఞప్తి చేసింది. ప్రీమియం పెట్రోల్‌ను 'హైఆక్టేన్ ఫ్యూయల్' లేదా 'పవర్ పెట్రోల్' అని పిలుస్తారు. ఇది సాధారణంగా లగ్జరీ కార్లు, స్పోర్ట్స్ బైక్‌లు, హైపెర్ఫార్మెన్స్ ఇంజిన్లలో వాడతారు. ఇది ఇంజిన్ పనితీరును మెరుగుపరచడమే కాకుండా, మైలేజీని కూడా పెంచుతుంది. ఈ ధరల పెంపు ప్రధానంగా లగ్జరీ వాహన యజమానులపై, సంపన్న వర్గాలపైనే ప్రభావం చూపనుంది. హెచ్‌పీసీఎల్‌ను అనుసరిస్తూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(IOCL) కూడా బల్క్ డీజిల్ ధరను లీటరుకు ఏకంగా లీటరుకు రూ.22 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇప్పటి వరకు రూ.87.57 గా ఉన్న లీటరు డీజిల్ ధర.. తాజా రేట్ల పెంపుతో రూ.109.59కి చేరుకుంది. రిటైల్ పెట్రోల్ బంకుల్లో లభించే డీజిల్ ధరలపై ప్రస్తుతం పెద్దగా ప్రభావం లేనప్పటికీ..నేరుగా కంపెనీల నుంచి పెద్ద మొత్తంలో డీజిల్ కొనే పారిశ్రామిక వినియోగదారులకు షాక్ తగిలింది.

రవాణా ఛార్జీలు పెరిగే అవకాశం

బల్క్ డీజిల్ ధరల పెరుగుదల ప్రధానంగా తయారీ రంగం, భారీ పరిశ్రమలు, లాజిస్టిక్స్ విభాగాలపై తీవ్రంగా ప్రభావం చూపనుంది. సిమెంట్, ఉక్కు కర్మాగారాలు, భారీ యంత్రాలను నడిపే పరిశ్రమలకు డీజిల్ వినియోగం అధికంగా ఉంటుంది. ఇది లీటరుకు రూ.22 పెరగడం వల్ల వారి ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరుగుతుంది. అలాగే నేరుగా కంపెనీల నుంచి డీజిల్ కొనే భారతీయ రైల్వే, రాష్ట్ర రవాణా సంస్థలు, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లు ప్రస్తుతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పెంపు వల్ల రవాణా ఛార్జీలు పెరిగే అవకాశం ఉంది. ఇది పరోక్షంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి దారితీయవచ్చు.

పశ్చిమాసియాలో యుద్ధం ముదురుతున్నా.. చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతున్నా.. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు సామాన్యులపై పెట్రోల్ భారం వేయలేదు. దేశంలో 60 రోజులకు సరిపడా వ్యూహాత్మక నిల్వలు ఉన్నప్పటికీ.. వచ్చే వారం నుంచి పెట్రోల్ మోతకు చమురు సంస్థలు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఆ మేరకు పెట్రోల్, డీజిల్‌పై రూ.3 నుంచి రూ.5 మేర అదనపు భారం మోపే అవకాశాలు కనిపిస్తున్నట్లు తెలిపాయి.

## ఆరంభ లాభాలు ఆవిరి..
# ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి విలువ



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. నిన్నటి భారీ నష్టాల నుంచి కోలుకుని ఉదయం భారీ లాభాల్లో ట్రేడ్ అయిన సూచీలు.. ఆఖర్లో మళ్లీ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో స్వల్ప లాభాలకే పరిమితమయ్యాయి. అదే సమయంలో రూపాయి విలువ మరింత క్షీణించింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86 పైసలు క్షీణించి 93.75 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరింది.

సెన్సెక్స్ ఉదయం 74,559.38 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,207.24) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో దాదాపు వెయ్యి పాయింట్ల మేర లాభపడి 75,286.39 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో సెన్సెక్స్ 325.72 పాయింట్ల లాభంతో 74,532.96 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 112.35 పాయింట్ల లాభంతో 23,114.50 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ట్రెంట్, రిలయన్స్ స్టాక్స్ లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బీఈఎల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండిగో స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 110 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4665 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఒక ఛార్జ్‌తో 902 కిమీ రేంజ్!
## ..షియోమి కారు



షియోమి చైనాలో అప్‌డేటెడ్ SU7 సెడాన్‌ను లాంచ్ చేసింది. ఈ లేటెస్ట్ మోడల్ భద్రతా పరికరాలు, డ్రైవర్-అసిస్టెన్స్ హార్డ్‌వేర్, క్యాబిన్ ఫీచర్లు, ఛాసిస్ సెటప్‌లో చాలా మార్పులు పొందింది. దీని ధర 219,900 యువాన్ల (సుమారు రూ. 29.79 లక్షలు) నుంచి ప్రారంభమవుతుంది.

కొత్త SU7 ఎలక్ట్రిక్ కారు 73 kWh, 96.3 kWh LFP ప్యాక్‌లతో పాటు, 101.7 kWh టెర్నరీ లిథియం బ్యాటరీ కూడా పొందుతుంది. వెర్షన్‌ను బట్టి CLTC రేంజ్ 720 కి.మీ, 902 కి.మీ, 835 కి.మీ ఉంటుందని షియోమి పేర్కొంది. ఈ ప్లాట్‌ఫామ్ 752V నుంచి 897V పరిధిలో హై-వోల్టేజ్ ఎలక్ట్రికల్ సిస్టమ్‌ను ఉపయోగిస్తుందని కంపెనీ తెలిపింది.

ఇంటీరియర్ విషయానికి వస్తే.. లోపలి భాగంలో, షియోమీ అప్డేటెడ్ మెటీరియల్స్ & ఇంటర్‌ఫేస్ డిజైన్‌తో క్యాబిన్‌ను సవరించింది. ఇందులో 16.1-అంగుళాల సెంట్రల్ డిస్‌ప్లే, 7.1-అంగుళాల రొటేటింగ్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, హెడ్-అప్ డిస్‌ప్లే ఉన్నాయి. ఇవన్నీ షియోమీ స్మార్ట్ కాక్‌పిట్ సిస్టమ్‌కు అనుసంధానమై ఉన్నాయి. ఈ సెటప్ వాయిస్ కంట్రోల్స్, మల్టీ-స్క్రీన్ ఇంటరాక్షన్‌కు సపోర్ట్ చేస్తుంది.

## ఇదిగిదిగో... ఈగో రాజా



'శంబాల' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆది సాయికుమార్ తమిళంలోకి అడుగుపెడుతున్నారు. ఆయన కథానాయకుడిగా తమిళంతోపాటు, తెలుగులోనూ ఓ చిత్రం రూపొందుతోంది. సతీష్ ముఖ్యపాత్రని పోషిస్తున్నారు. గురు శరవణన్ దర్శకుడు. ఎస్.జి.ఎస్ ప్రొడక్షన్స్ పతాకంపై జి.సురేష్ నిర్మిస్తున్నారు. యాక్షన్, భావోద్వేగాలతోపాటు ఇతర మాస్ అంశాలతో రూపొందుతున్న ఈ సినిమాకి 'ఈగో రాజా' అనే పేరుని ఖరారు చేశారు. ఉగాది సందర్భంగా గురువారం టైటిల్ పోస్టర్‌ని విడుదల చేశారు. "ఆది సాయికుమార్, గురు శరవణన్‌ల కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ద్విభాషా చిత్రమిది. మాస్ అంశాలతో అలరించేలా ఈ చిత్రం ఉంటుంద"ని సినీ వర్గాలు చెప్పాయి.



## సేతుపతి సాయిపల్లవితో మణిరత్నం మూవీ.. ఆ రూమర్లకు చెక్

: ప్రముఖ దర్శకుడు మణిరత్నం (Mani Ratnam) కొత్త సినిమాకు సంగీత దర్శకుడి విషయంలో కోలీవుడ్‌లో ఇటీవల చర్చ సాగింది. రొటీన్‌కు భిన్నంగా ఈసారి తన చిత్రం కోసం వర్ధమాన సంగీత దర్శకుడిని ఎంపిక చేసే ఆలోచనలో ఉన్నారంటూ ప్రచారం జరిగింది. తాజాగా దీనిపై క్లారిటీ వచ్చింది. నిర్మాణసంస్థ లైకా ప్రొడక్షన్స్ ఇచ్చిన అప్‌డేట్‌తో ఈ రూమర్లకు చెక్ పడినట్లైంది. తమ సినిమా ఆడియో రైట్స్ సోనీ మ్యూజిక్ సొంతం చేసుకొందని తెలియజేస్తూ ఆ సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. అందులో ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ పేరు ఉంది.
మరోసారి ఈ హిట్ కాంబో రిపీట్ కానుండటంతో అభిమానులు సోషల్ మీడియాలో ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇంకా పేరు ఖరారు కాని ఈ సినిమాలో విజయ్ సేతుపతి (Vijay Sethupathi) సాయి పల్లవి (Sai Pallavi) హీరోహీరోయిన్లు. ఈ క్రేజీ కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.
మణిరత్నం తెరకెక్కించిన 'రోజా' సినిమాతోనే రెహమాన్ సంగీత దర్శకుడిగా సినీ ప్రయాణం మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. తొలి చిత్రంతోనే ఈ కాంబోకు విశేష క్రేజ్ దక్కింది. మణిరత్నం తెరకెక్కించిన 'బొంబాయి', 'సఖి', 'యువ', 'విలన్', 'పొన్నియిన్ సెల్వన్' తదితర చిత్రాలకు రెహమాన్ స్వరాలు సమకూర్చారు. సేతుపతి విషయానికొస్తే.. మణిరత్నం గతంలో రూపొందించిన 'నవాబ్' సినిమాలో ఆయన కీలక పాత్ర పోషించారు.

## రష్మికకు గద్దర్ అవార్డు
# అత్తయ్య ఎమోషనల్

పద్నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తెలంగాణ ప్రభుత్వం 'గద్దర్ సినీ పురస్కారాల' పేరుతో పునఃప్రారంభించిన సినీ అవార్డుల వేడుక వరుసగా రెండో ఏడాది కూడా అత్యంత వైభవంగా జరిగింది. ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలో టాలీవుడ్ నటి రష్మిక మందన్న ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'గర్ల్ ఫ్రెండ్' చిత్రంలో తన అద్భుత నటనకు గాను ఆమె ఉత్తమ నటిగా అవార్డును అందుకుంది.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్న అనంతరం రష్మిక ప్రసంగిస్తూ భావోద్వేగానికి గురయింది. "గతంలో నా నటనపై ఎన్నో విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో తీవ్రమైన ట్రోల్స్ ఎదుర్కొన్నాను. కానీ ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం నా ప్రతిభను గుర్తించి, ఈ గౌరవాన్ని అందించడం నాపై ఉన్న బాధ్యతను పెంచింది. ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం నా జీవితంలో మర్చిపోలేని అనుభూతి" అని ఆమె పేర్కొంది
ఇటీవల టాలీవుడ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండను వివాహం చేసుకున్న రష్మిక, తన ప్రసంగంలో చేసిన వ్యాఖ్యలు అందరి హృదయాలను హత్తుకున్నాయి. "ఇప్పటివరకు నన్ను మీ ఇంటి ఆడబిడ్డలా, కూతురిలా ఆదరించారు. కానీ ఇప్పుడు నేను తెలంగాణ కోడలిగా మీ ముందుకు వచ్చాను. నా ఫ్యామిలీని (దేవరకొండ కుటుంబం) మీరందరూ జాగ్రత్తగా చూసుకోండి" అని ఆమె అనగానే సభా ప్రాంగణం మొత్తం హర్షధ్వానాలతో మారుమోగిపోయింది. రష్మిక మాటలకు గ్యాలరీలో ఉన్న విజయ్ దేవరకొండ తల్లి కూడా భావోద్వేగానికి గురి కావడం అక్కడున్న వారిని కదిలించింది.



## ఏళ్ల తర్వాత అబ్బాస్ రీ ఎంట్రీ..
# అందుకే ఎస్ చెప్పారు: దర్శకుడు



'ప్రేమదేశం'తో అప్పట్లో సెన్సేషన్ అయిన అబ్బాస్ (Abbas).. 2015లో నటనకు దూరమయ్యారు. ఆయన రీ ఎంట్రీ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో త్వరలోనే అబ్బాస్ మళ్లీ తెరపై సందడి చేయనున్నారు. 'హ్యాపీరాజ్' (Happy Raj) అనే తమిళ సినిమాలో ఓ కీలక పాత్రతో ఇన్నేళ్లకు కోలీవుడ్, టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించబోతున్నారు. ఈ సినిమా తెలుగులోనూ ఈనెల 27న (Happy Raj Release Date) విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ట్రైలర్ విడుదల వేడుకలో దర్శకుడు మరియా రాజా ఆసక్తి విషయాలు పంచుకున్నారు. ఈ చిత్రంలో నటించేందుకు అబ్బాస్ అంగీకరించేందుకు కారణమేంటి? ఇందులో హీరోగా జీవీ ప్రకాశ్ కుమార్ (GV Prakash Kumar) కన్నా ముందు ఎవరిని తీసుకోవాలనుకున్నారు? తదితర ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.
"ఈ సినిమా కథ రాయడం పూర్తయ్యాక.. హీరో నవీన్ పొలిశెట్టికి మెయిల్ చేశా. నా స్క్రిప్ట్ చదివిన ఆయన.. కాల్ చేసి అరగంటసేపు దాని గురించి మాట్లాడారు. ఆ మాటలతో నాపై నాకు నమ్మకం పెరిగింది. స్టోరీ నచ్చినా అప్పటికే వేరే కమిట్‌మెంట్స్ ఉంటడంతో ఇందులో నటించలేకపోయారు. ఆ తర్వాత జీవీ ప్రకాశ్‌కు చెప్పా. ఆయన అంగీకరించారు. ప్రదీప్ రంగనాథన్ 'లవ్‌టుడే' సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేశా. 'హ్యాపీరాజ్' కూడా అలాగే ఆద్యంతం అలరిస్తుంది" అని పేర్కొన్నారు. "మంచి కథ ఉంటే రీ ఎంట్రీ ఇచ్చేందుకు అబ్బాస్ చాలా కాలంగా వేచి చూశారు. ఈ క్రమంలో ఎన్నో స్టోరీలు విన్నా



ఆయనకు నచ్చలేదని తెలిసింది. న్యూజిలాండ్‌లో ఉంటున్న ఆయనకు ఆన్‌లైన్ ద్వారా ఈ సినిమా కథ చెప్పా. వెంటనే 'రీ ఇంట్రీ ఇచ్చేందుకు ఇది పర్‌ఫెక్ట్ స్టోరీ' అని అన్నారు. ఆయన నటించేందుకు అంగీకరించారంటే దానికి ప్రధాన కారణం కథే" అని పేర్కొన్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు టాలీవుడ్ డైరెక్టర్లు వెంకీ అట్లూరి, శివ నిర్వాణ ముఖ్య అతిథులుగా హాజరై, సినిమా విజయం అందుకోవాలని ఆకాంక్షించారు.

## 'ధురంధర్ 2'కు రూ.1000 కోట్లు వస్తే.. సగం ఈ నటుడి వల్లే!




దేశభక్తి అంశాలతో కూడిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' (Dhurandhar) ఓ ట్రెండ్ సెట్ చేసింది. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ మూవీ సీక్వెల్ 'ధురంధర్ 2' (Dhurandhar 2) కూడా బాక్సాఫీసు వద్ద దూసుకెళుతోంది. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నటుడు రాకేశ్ బేడీ (Rakesh Bedi) ఈ విజయంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ రెండు సినిమాల్లో కీలకమైన జమీల్ జమాల్ పాత్ర పోషించిన ఆయన.. తన పెర్ఫామెన్స్‌పై హీరో రణ్‌వీర్ సింగ్ ఇచ్చిన ప్రశంసను గుర్తుచేసుకున్నారు. "ఈ చిత్ర బృందమంతా సెట్స్‌లో కలివిడిగా ఉండేది. నా పాత్ర షూటింగ్ పూర్తయిన రోజు.. రణ్‌వీర్ మైక్ తీసుకొని 'ఒకవేళ ఈ మూవీ రూ.1000+ కోట్లు వసూలుచేస్తే.. అందులో రూ.500 కోట్లు రాకేశ్ వల్లే వస్తాయి' అని చెప్పారు. ఓ నటుడిగా ఇంతకుమించి ఏం కావాలి?" అని పేర్కొన్నారు. సీనియర్ పొలిటీషియన్‌గా నయవంచక పాత్రలో రాకేశ్ బేడీ అదరగొట్టారు. ముఖ్యంగా 'ధురంధర్ 2'లో ఈ పాత్ర ఇచ్చే ట్విస్ట్ ప్రేక్షకులకు ఓ ట్రీట్. బాలీవుడ్‌లో 47 ఏళ్ల ప్రస్థానం రాకేశ్ బేడీది. 'ధురంధర్' డైరెక్టర్ ఆదిత్యధర్ గతంలో తెరకెక్కించిన మరో హిట్ మూవీ 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్'లోనూ నటించారు. మరి, ఇంతకీ 'ధురంధర్ 2' తొలిరోజు కలెక్షన్ల మాటేంటంటే..?
సినీప్రియుల ఆసక్తిని దృష్టిలోపెట్టుకొని 'ధురంధర్ 2'ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసిన సంగతి తెలిసిందే. తొలిరోజే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ప్రపంచవ్యాప్తంగా రూ.172+ కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. నెట్ పరంగా రూ.145+ కోట్లు అని పేర్కొన్నాయి. ఇందులో దాదాపు రూ.100 కోట్లు హిందీలోనే రావడం గమనార్హం. పెయిడ్ ప్రివ్యూల ద్వారా రూ.40+ కోట్లు వచ్చాయని తెలిసింది. నెట్ కలెక్షన్లలో ఫస్ట్‌డే అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ మూవీగా 'ధురంధర్ 2' రికార్డులు నెలకొల్పింది.

## తెలుగు హీరోలపై ఎందుకంత కోపం? హీరోయిన్ రియాక్షన్ ఇదే..

తమిళ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా నటించిన చిత్రం హ్యాపీ రాజ్. శ్రీగౌరీ ప్రియ హీరోయిన్‌గా నటించింది. ఒకప్పటి హీరో అబ్బాస్ దాదాపు పదేళ్ల తర్వాత వెండితెరపై రీఎంట్రీ ఇస్తున్నాడు. లవ్‌టుడే సినిమాకు ప్రదీప్ రంగనాథన్ వద్ద సహాయ దర్శకుడిగా పని చేసిన మరియ రాజ్ (మరియ ఇళంజెళియన్) దర్శకత్వం వహించాడు. ఈ సినిమా తమిళంతోపాటు తెలుగులోనూ విడుదల కానుంది. మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.

**తెలుగు హీరోలపై కోపం?**

ఈ క్రమంలో శుక్రవారం నాడు హ్యాపీరాజ్ తెలుగు ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ శ్రీ గౌరీప్రియకు వింత ప్రశ్న ఎదురైంది. మీరు సినిమాల్లో తమిళ హీరోలతో రొమాంటిక్‌గా ప్రవర్తిస్తారు.. అదే తెలుగు హీరోలతో యారొగెంట్‌గా ప్రవర్తిస్తున్నారు, అంటే వాళ్లను కొడతారు. తెలుగు హీరోలపై ఎందుకంత కోపం? అని ఓ విలేకరి ప్రశ్నించాడు.

**నేనేమైనా కంకణ కట్టుకున్నానా?**

ఆ ప్రశ్న విని గౌరీప్రియ అవాక్కయింది. నేను ఒక్క సినిమాలోనే హీరోను కొట్టాను.. నేనేమైనా హీరోలను కొట్టాలని కంకణం కట్టుకున్నానా? అసలు నాకు ఎవరి మీదా కోపం లేదు. ఆ లెక్కన చూస్తే.. నేను అన్ని సినిమాల్లో ఏడుస్తానని అంటారు. తమిళ సినిమాల్లో ఏడుస్తుంది, తెలుగు మూవీస్‌లో మాత్రం సంతోషంగా నవ్వుతుందంటారు. అవేవీ నిజం కాదు.. సినిమాలో నా పాత్ర అలా డిజైన్ చేస్తున్నారు అని బదులిచ్చింది.

**సినిమా**

తెలుగమ్మాయి అయిన శ్రీ గౌరీ ప్రియ.. లవర్, మ్యాడ్, మెయిల్ వంటి సినిమాల్లో నటించింది. మ్యాడ్ మూవీలో ఈమె.. హీరో రామ్ నితిన్ చెంప చెళ్లుమనిపిస్తుంది. ఆ క్లిప్పింగ్ సోషల్ మీడియాలో తెగ వైరలయింది. ప్రస్తుతం ఆమె చేతిలో వింటారా సరదాగా, చెన్నై లవ్‌స్టోరీ చిత్రాలున్నాయి.



## ఓటీటీలో హనుమాన్ హీరో ఎంట్రీ.. ఏకంగా హోస్ట్‌గా ఛాన్స్..!

హనుమాన్ మూవీతో ఓ రేంజ్‌లో క్రేజ్ దక్కించుకున్న టాలీవుడ్ తేజ సజ్జా. ఆ తర్వాత మిరాయ్ మూవీతో బాక్సాఫీస్ వద్ద మ్యాజిక్ క్రియేట్ చేశాడు. తాజాగా ఈ యంగ్ హీరో ఓటీటీలోకి ఎంట్రీ ఇస్తున్నాడు. అమెజాన్ ప్రైమ్ ప్రకటించిన ప్రముఖ రియాలిటీ షోకు హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. గతంలో బాలీవుడ్‌లో సక్సెస్ అయిన ఈ షోను తెలుగులోనూ తీసుకొస్తున్నారు.
అమెజాన్ ప్రైమ్ వీడియోలో రాబోతున్న 'ది ట్రైటర్స్ తెలుగు రియాలిటీ షోకు తేజ సజ్జా హోస్ట్‌గా ఛాన్స్ కొట్టేశారు. దీంతో ఓటీటీలోనూ హనుమాన్ హీరో సందడి చేయనున్నాడు. ఇలాంటి ఇంటర్నేషనల్‌గా క్రేజ్ ఉన్న షోకి హోస్ట్‌గా వ్యవహరించడం వల్ల అతని క్రేజ్ మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఇటీవల జరిగిన ప్రైమ్ వీడియో ఈవెంట్‌లో బాలీవుడ్ స్టార్ మేకర్ కరణ్ జోహార్‌తో కలిసి తేజ సజ్జా వేదికపై సందడి చేశారు. ప్రపంచవ్యాప్తంగా బాగా పాపులర్ అయిన షో ట్రైటర్స్. ఈ షోలో కేవలం చాలా ఇంటలిజెన్స్‌తో ఉన్నవాళ్లు మాత్రమే సక్సెస్ అవుతారు. ఇప్పుడు ఈ గ్లోబల్ షో తెలుగు వర్షన్ ప్రైమ్ వీడియోలో రానుంది రాబోతోంది. అయితే ఈ అప్ కమింగ్ షోకి మన టాలీవుడ్ యంగ్ స్టార్ తేజ హోస్ట్‌గా బాధ్యతలు తీసుకోబోతున్నారు. గతేడాది హిందీలో వచ్చిన ఈ ట్రైటర్స్ షోను బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ హోస్ట్ చేశారు. జైసల్మీర్‌లోని సూర్యగఢ్ ప్యాలెస్‌లో ఈ రియాలిటీ షో జరగనుంది.



## సంజు విషయంలో
## గంభీర్ మాటే నిజమైంది: శశిథరూర్



అవకాశాల కోసం ఎదురుచూస్తున్నప్పుడు భారత క్రికెటర్ సంజు శాంసన్‌కు కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మద్దతుగా నిలిచారు. టీమ్ఇండియా మేనేజ్‌మెంట్‌పై విమర్శలూ చేశారు. టీ20 ప్రపంచ కప్‌లో అద్భుతమైన ప్రదర్శన చేసిన సంజుశాంసన్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సంజుశాంసన్ గురించి ఆసక్తికర విషయాలను శశిథరూర్ వెల్లడించారు. సంజుకు 14 ఏళ్ల వయసు ఉన్నప్పుడే తనని కలిశానని.. అప్పుడే 'మరో ధోని'గా అభివర్ణించినట్లు గుర్తుచేశాడు. ఇటీవల ఇదే మాటను ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు చెబితే.. సంజుశాంసన్ ఒకేఒక్కడుగా నిలుస్తాడని అన్నాడు. ఇప్పుడా మాటలు గుర్తుచేసుకుంటే నిజమేనని అనిపిస్తోందని థరూర్ వెల్లడించారు.

"ఓ రకంగా నేను సంజు విషయంలో మామయ్యలా వ్యవహరించానని అనుకుంటా. అతడికి 14 ఏళ్లు ఉన్నప్పుడే నేను కలిశా. అప్పట్నుంచే చాలా ప్రోత్సహించా. అలా చెప్పేందుకు నేనేమీ క్రికెట్‌కు గొప్ప అభిమానిని కాదు కానీ.. పద్నాలుగేళ్ల వయసులోనే సంజు ఏదో సాధిస్తాడని భావించా. మరో ధోని అవుతాడని ఊహించా. అతడికీ అదే మాట చెప్పా. కొన్నేళ్ల తర్వాత ఇదే మాటలను నా మిత్రుడు గౌతమ్ గంభీర్ వద్ద గుర్తుచేసినప్పుడు.. 'సంజు మరెవరికీ ప్రతిరూపం కావాల్సిన అవసరం లేదు. అతడిని అతడిలానే ఉండనిద్దాం. 'సంజు శాంసన్'లా ప్రత్యేకంగా నిలుస్తాడు' అని అన్నాడు. ఇప్పుడు అదే జరిగింది. ప్రశాంతంగా కేవలం ఆట పైనే దృష్టిపెట్టే సంజుశాంసన్‌కు ముందుందూ మరిన్ని అవకాశాలు ఇవ్వాలి. తప్పకుండా వన్డేల్లోనూ ఆడించాలి. అతడి గత చివరి వన్డేలో సెంచరీ చేశాడు. ఆ తర్వాత అతడిని తప్పించారు" అని శశిథరూర్ వెల్లడించారు.

ధోనితో సంజు కలిసి..

ఐపీఎల్‌లో తొలిసారి ధోనితో కలిసి ఆడే అవకాశం సంజు శాంసన్‌కు దక్కింది. గతేడాది వరకూ రాజస్థాన్ రాయల్స్‌తో ఉన్న సంజు.. ఇప్పుడు చెన్నై సూపర్ కింగ్స్‌లోకి వచ్చాడు. ఇప్పటికే వీరిద్దరూ మాట్లాడుకుంటోన్న వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

## రూ.16వేల కోట్ల ఆఫర్‌ను
## తిరస్కరించిన రాజస్థాన్ రాయల్స్





ఐపీఎల్ 2026 సీజన్ మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఇప్పుడు ఓ వార్త తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఫ్రాంచైజీలను అమ్మేందుకు రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఓ భారీ ఆఫర్‌ను రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. ఏకంగా రూ. 16వేల కోట్ల (1.7 బిలియన్ డాలర్లు) బిడ్డింగ్‌నే వద్దని పక్కనపెట్టడం గమనార్హం. కొలంబియా పసిఫిక్ క్యాపిటల్స్ పార్టనర్స్ (సీపీసీపీ) కన్సార్టియం నుంచి ఈ ఆఫర్ వచ్చిందని.. అయినా సరే రాజస్థాన్ మరింత విలువను కోరుకుంటోందని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

యూఎస్, కెనడాలో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అయిన సీపీసీపీ ఈ బిడ్‌ను దాఖలు చేసింది. కేవలం రెండు వారాల్లోనే మొత్తం సొమ్ము చెల్లిస్తామని వ్యవస్థాపక పార్ట్‌నర్స్ నిశా సచ్‌దేవ, దుబ్జీత్ గుప్తా ముందుకొచ్చారు. అయితే, ఆర్ఆర్ బోర్డు మాత్రం ఆ ఆఫర్‌ను తిరస్కరించింది. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలో ఎమెర్జింగ్ మీడియా వెంచర్స్ అధినేత మనోజ్ బదాలె వాటా 65 శాతం కాగా.. రెడ్‌బర్డ్ క్యాపిటల్‌కు మిగతా వాటా ఉంది. అయితే, ఫ్రాంచైజీ విలువ మరింత పెరిగే అవకాశం ఉందనే ఉద్దేశంతో వారు వేచి చూస్తున్నారు.

భారీగా పెరగనున్న ఆర్సీబీ విలువ

ఐపీఎల్‌లో అత్యంత ప్రజాదరణ కలిగిన జట్లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కూడా ఒకటి. ఆ టీమ్ ఒక్కసారి మాత్రమే టైటిల్‌ను నెగ్గినా.. స్టార్ క్రికెటర్లు, మౌలిక వసతులు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో వచ్చే వీక్షణలు, ఇతర అంశాలతో ఆర్సీబీ విలువ భారీగానే ఉండబోతోంది. ఇప్పుడు రాజస్థాన్ రాయల్స్ రూ.16 వేల కోట్ల బిడ్‌నే వద్దని చెప్పిన నేపథ్యంలో.. ఆర్సీబీ విలువ అంతకంటే ఎక్కువే ఉండొచ్చని సమాచారం. ఆర్ఆర్‌కు వచ్చిన బిడ్డింగ్ కంటే కనీసం 15 నుంచి 20 శాతం అధికంగా కోట్ చేసే అవకాశం లేకపోలేదు. అంటే, రూ.20 వేల కోట్ల వరకూ విలువ వెళ్లినా ఆశ్చర్యపడనక్కర్లేదు. ఆర్సీబీ కోసం మణిపాల్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రంజన్ పాయ్ సారథ్యంలోని కన్సార్టియం బరిలోకి దిగింది.

## 'మానసిక వేదన అనుభవిస్తున్నా'




పోలండ్ టెన్నిస్ స్టార్ ఇగా స్వియాటెక్ సంచలన వ్యాఖ్యలు చేసింది. మ్యాచ్ ఓడిపోవడం తనను మానసిక వేదనకు గురి చేస్తోందని, ఓటములతో కోర్టులో ఆటపై పట్టు కోల్పోతున్నట్లుగా అనిపిస్తుందని తెలిపింది. గురువారం ప్రారంభమైన మియామి ఓపెన్ టెన్నిస్ టోర్నీలో స్వియాటెక్ తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో 50వ ర్యాంకర్ మగ్దా లినెట్టె 61, 57, 63తో ప్రపంచ మూడో ర్యాంకర్ అయిన స్వియాటెక్‌ను మూడు సెట్లలో చిత్తు చేసింది. ఒక డబ్ల్యూటీఏ టూర్‌లో భాగంగా ఓపెన్ టెన్నిస్ టోర్నీలో 73 మ్యాచ్‌ల్లో వరుస విజయాల తర్వాత తొలి రౌండ్‌లో ఓడిపోవడం స్వియాటెక్‌కు ఇదే తొలిసారి. మ్యాచ్ ఓటమి అనంతరం స్వియాటెక్ మాట్లాడుతూ.. 'నేను ఓడిపోయానంటే నమ్మబుద్ధి కావడం లేదు. రాను రాను టెన్నిస్ ఆట కష్టంగా అనిపిస్తోంది . ఈ ఆట చాలా తేలిక అనుకున్నా. కానీ, కోర్టులో మానసికంగా మనం ఎలా ఉంటామనేది చాలా కీలకం. ఇది నాకొక చెత్త మ్యాచ్. ఈ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటా. మళ్లీ నా పనిలో మునిగిపోతా. ప్రాక్టీస్ చేస్తాను. పాజిటివ్‌గా ఆలోచిస్తూ.. నా ఆటను మెరుగుపరచుకుంటా' అని స్వియాటెక్ పేర్కొంది. కాగా స్వియాటెక్ తన టెన్నిస్ కెరీర్‌లో ఇప్పటివరకు ఆరు గ్రాండ్‌స్లామ్‌లు సాధించగా ఇందులో నాలుగుసార్లు ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్ ఒక్కోసారి నెగ్గడం విశేషం. ఒక దశలో స్వియాటెక్ డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో 125 వారాల పాటు అగ్రస్థానంలో కొనసాగడం విశేషం.

## 24 ఏళ్ల తర్వాత మ్యాచ్.. సంచలనం రిపీటయ్యేనా?



భారత మహిళల జట్టు సౌతాఫ్రికా గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడనుండడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఎందుకంటే 24 ఏళ్ల కిందట మహిళల జట్టు సౌతాఫ్రికాలో ఏకైక టెస్టు మ్యాచ్ ఆడింది. ఆ మ్యాచ్‌లో భారత్ 10 వికెట్ల తేడాతో సంచలన విజయాన్ని అందుకుంది. మరి 2002లో అద్భుత విజయాన్ని నమోదు చేసిన టీమిండియా మహిళలు మరోసారి ఆ సీన్‌ను రిపీట్ చేస్తారా లేదా అన్నది చూడాలంటే డిసెంబర్ 20 వరకు ఆగాల్సిందే. ఈ నేపథ్యంలో క్రికెట్ సౌతాఫ్రికా శుక్రవారం భారత మహిళల జట్టు పర్యటనకు సంబం ధించిన వన్డేలు, ఏకైక టెస్టు మ్యాచ్‌కు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసింది. సఫారీల పర్యటనలో తొలుత సౌతాఫ్రికా ఎమర్జింగ్ టీమ్‌తో హర్మన్ బృందం వార్మప్ మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత డిసెంబర్ 9 నుంచి 15 మధ్య మూడు వన్డేలు, ఆ తర్వాత డిసెంబర్ 20 నుంచి 23 మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ ఆడనుంది. ఈ సిరీస్‌కు ముందే టీ20 ప్రపంచకప్ సన్నాహకంగా వచ్చే నెలలో సౌతాఫ్రికాలో భారత మహిళల జట్టు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనున్న సంగతి తెలిసిందే. మహిళల టీ20 ప్రపంచకప్ ఇంగ్లండ్ వేదికగా జూన్ 12 నుంచి జూలై 5 వరకు జరగనుంది. 2002లో మార్చి 19 నుంచి 22 వరకు పార్ల్ వేదికగా జరిగిన ఆనాటి మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 9 వికెట్ల నష్టానికి 404 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. భారత బ్యాటర్లలో అంజూ జైన్ (52), కెప్టెన్ అంజుమ్ చోప్రా (80), మిథాలీరాజ్ (55), హేమలతా కలా (64), మమతా మబెన్ (50) అర్ధ సెంచరీలతో రాణించారు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లలో దీపా మరాతే 3 వికెట్లు తీయగా, నీతూ డేవిడ్ 2 వికెట్లు పడగొట్టింది. ఆ తర్వాత ఫాలోఆన్ ఆడిన సౌతాఫ్రికా జట్టు 266 పరుగుల వద్ద ఆలౌటైంది. జులన్ గోస్వామి, హేమలతా కలా చెరో 3 వికెట్లతో రాణించారు. ఆ తర్వాత 13 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 1.3 ఓవర్లలో వికెట్లేమి నష్టపోకుండా ఛేదించి విజయాన్ని అందుకుంది.

సౌతాఫ్రికాలో భారత మహిళల జట్టు పర్యటన వివరాలు..

డిసెంబర్ 6: సౌతాఫ్రికా ఎమర్జింగ్ జట్టుతో వార్మప్‌మ్యాచ్
డిసెంబర్ 9: తొలి వన్డే, పొచెఫ్‌స్ట్రూమ్
డిసెంబర్ 12: రెండో వన్డే, బ్లోమ్‌ఫోంటైన్
డిసెంబర్ 15: మూడో వన్డే, కేప్‌టౌన్
డిసెంబర్ 2023: ఏకైక టెస్టు మ్యాచ్, గెబెర్హా

## ఐపీఎల్‌కు మూడో ర్యాంకు..
# డబ్ల్యూసీఏపై తీవ్ర విమర్శలు



సంపదపరంగా ప్రపంచంలోనే అత్యంత విలువైన టీ20 లీగ్ ఐపీఎల్. ఇందులో ఒక్కసారి చోటు దక్కించుకుంటే ఆటగాళ్లకు కాసుల వర్షమే. అలాంటి లీగ్‌కు వరల్డ్ క్రికెటర్స్ అసోసియేషన్ (WCA) మూడో ర్యాంకు ఇవ్వడం గమనార్హం. దీనిపైనే సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఐపీఎల్‌లో అందుకొనే పారితోషికంలో కనీసం ఐదోవంతు కూడా ఉండని ది హండ్రెడ్ లీగ్‌కు అగ్రస్థానం ఇచ్చింది. ఇటీవల ముగిసిన ది హండ్రెడ్ లీగ్ వేలంలో అత్యధిక ధరను సొంతం చేసుకొన్న క్రికెటర్‌కు దక్కిన మొత్తం రూ.4.81 కోట్లు. అదే ఐపీఎల్‌లో అయితే రూ.25 కోట్ల పైమాటే. కామెరూన్ గ్రీన్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.25.20 కోట్లు వెచ్చించి మరీ సొంతం చేసుకుంది. దక్షిణాఫ్రికా వేదికగా జరిగే ఎస్‌ఏ20 లీగ్‌కూ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానం దక్కింది. ఇక్కడా టాప్ ప్లేయర్‌కు వచ్చిన మొత్తం కేవలం రూ. 8.3 కోట్లే. అంటే ఐపీఎల్‌లో దేశవాళీ క్రికెటర్ దక్కించుకున్న రూ.12.40 కోట్ల కంటే చాలా తక్కువే. ఇలాంటి లీగ్‌కు మూడో స్థానం ఇవ్వడమేంటని అభిమానుల నుంచి కామెంట్లు వస్తున్నాయి.

ఇవీ అంశాలు..

ర్యాంకులను ప్రకటించేందుకు డబ్ల్యూసీఏ కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంది. వాటిని క్రోడీకరించి 100 పాయింట్లకు ఎవరికి ఎంత ఇవ్వాలో నిర్ణయించింది. ఆటగాళ్లకు జీత భత్యాలు, సెక్యూరిటీ, హక్కులు, వృత్తిపరమైన ప్రమాణాలు.. ఇలాంటి వాటిని ఎంచుకొని పాయింట్లను కేటాయించింది. ఆటగాళ్లు, వారి అసోసియేషన్లు, ఏజెంట్ల నుంచి సర్వే ఫీడ్‌బ్యాక్ తీసుకొని ర్యాంకులను ప్రకటించింది.

ఎవరికి ఏ స్థానమంటే?

ది హండ్రెడ్ 75.2
ఎస్ఏ20 68.0
ఐపీఎల్ 62.6
బిగ్‌బాష్ లీగ్ 62.5
పీఎస్ఎల్ 48.0
మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) 43.0
ఐఎల్‌టీ20 39.1
సీపీఎల్ 38.9
అబుదాబి టీ10 30.1
బీపీఎల్ 22.6

ఐపీఎల్‌కు తగ్గిందిలా..

ఆటగాళ్లకు ఇచ్చే మొత్తం, చెల్లింపుల వ్యవహారంలో ఐపీఎల్‌కు పూర్తి మార్కులు పడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఐపీఎల్‌కు ఉన్న ఆర్థికబలం మరే జట్టుకు లేదని డబ్ల్యూసీఏ పేర్కొంది. అయితే, ఆటగాళ్ల హక్కుల రక్షణకు సంబంధించి ఐపీఎల్‌కు తక్కువ మార్కులు వచ్చాయి. ఈవిషయంలో ఇంకాస్త మెరుగుకావాల్సిన అవసరం ఉందని తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ విస్తరణకు లీగ్‌ల కృషి మరువలేనిదని డబ్ల్యూసీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ టామ్ మోఫాట్ తెలిపారు. ఇప్పుడీ ర్యాంకుల ఉద్దేశం ఆయా లీగ్‌లను తక్కువ చేయడం కాదని.. మరింత విజయవంతంగా మారేందుకు అవసరమైన సాయం అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

# ప్రపంచ అథ్లెటిక్స్ కు భువనేశ్వర్ ఆతిథ్యం



దిల్లీ: ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌నకు భువనేశ్వర్ ఆతిథ్యమివ్వనుంది. గురువారం పోలెండ్‌లో సమావేశమైన ప్రపంచ అథ్లెటిక్స్ పాలకవర్గం.. ప్రతిష్ఠాత్మక పోటీల ఆతిథ్య హక్కుల్ని భారత్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. "2028 ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఆతిథ్య హక్కుల్ని భారత్‌కు కేటాయించాం" అని ప్రపంచ అథ్లెటిక్స్ ఉపాధ్యక్షుడు ఆదిల్ సుమరివాలా తెలిపాడు. ప్రపంచ టోర్నీ ఆతిథ్యం కోసం ఈ ఏడాది ఆరంభంలో బిడ్ దాఖలు చేసినట్లు భారత్ అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్‌ఐ) వెల్లడించింది. "అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న భారత అథ్లెటిక్స్ ప్రతిష్ఠకు ఇది నిదర్శనం. ఒలింపిక్స్, ప్రపంచ వేదికలపై స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పతకాలు సాధించిన తర్వాత భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ క్రీడలపై ప్రపంచం దృష్టి కేంద్రీకరించింది" అని ఏఎఫ్‌ఐ అధ్యక్షుడు బహదూర్‌సింగ్ సాగూ తెలిపాడు. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియం సముదాయంలోని అత్యాధునిక ఇండోర్ కేంద్రాన్ని ప్రపంచ అథ్లెటిక్స్ బృందం ఇప్పటికే పరిశీలించింది. మూడు రోజుల పాటు జరిగే ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్‌లో పురుషులు, మహిళలకు 13 ఈవెంట్ల చొప్పున మొత్తం 26 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. 60 మీ, 400 మీ, 800 మీ, 1500 మీ, 3000 మీ పరుగుతో పాటు 60 మీ హర్డిల్స్, 4×400 మీ రిలే, హైజంప్, పోల్ వాల్ట్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, హెప్టాథ్లాన్ (మహిళలకు పెంటాథ్లాన్) పోటీలు ఉంటాయి.